E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 25-01-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక: 25 పేజీలు–6 www.ekaburu.com




28 నుంచి బడ్జెట్ సెషన్ 27న అఖిలపక్ష భేటీ

» 2లో

బెంగాల్‌లో హడావుడిగా

## సర్ ప్రక్రియ

- ,ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యానికి విఘాతం
- నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ వ్యాఖ్యలు



ఈ-కబురు కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) జరుగుతున్న తీరుపై నోబెల్ గహీత అమర్త్య సేన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అనవసరపు హడావుడితో సర్‌ను అమలు చేస్తున్నారన్నారు. దీని కారణంగా ప్రజల భాగస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో ఉంటున్న ఆయన ఇటీవల పీటీఐ ప్రతినిధితో మాట్లాడారు.

తరువాయి 3లో

## అగ్నికీలల్లో ఐదుగురు




ఈ-కబురు, హైదరాబాద్/అబిడ్స్: నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఓ ఫర్నిచర్ షాపులో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం ఇద్దరు పిల్లలతో సహా ఆరుగురు వ్యక్తులు అగ్నికీలల్లో చిక్కుకున్నారు.వీరిలో ఒకరు తప్పించుకుని బయటపడగా..మిగతా ఐదుగురి ఆచూకీ అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా లభించలేదు. వివరాల్లోకి వెళ్తే.. అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందీ ప్రచార సభ పక్కన ఉన్న ఐదంతస్తుల సాయి విశ్వాస్ చాంబర్‌లో బచాస్ ఫర్నిచర్ క్యాస్టిల్ పేరుతో వివిధ రకాల ఫర్నిచర్ వ్యాపారాలను సతీశ్ అనే వ్యాపారి నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో అకస్మాత్తుగా ఈ భవనంలో మంటలు ఎగసిపడ్డాయి. దీనిపై వెంటనే యజమాని సతీశ్ అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తరువాయి 2లో

## వాణిజ్య ఒప్పందాలతో
## యువతకు నూతన అవకాశాలు

- దేశ విదేశాల్లో విస్తృతంగా ఉద్యోగాలు, ఉపాధి
- యువత అభివృద్ధి, సంక్షేమం కోసం శ్రమిస్తున్నాం
- ఉద్యోగ జీవితంలో ప్రజాసేవే పరమావధిగా భావించాలి
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- 61 వేల మందికి నియామక పత్రాలు



ఈకబురు, న్యూఢిల్లీ: మన యువతకు దేశ విదేశాల్లో నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వేర్వేరు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. యువత అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో అత్యధిక యువ జనాభా మన దేశంలోనే ఉందని గుర్తుశారు. వారికి కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తే దేశం ప్రగతి మరింత వేగవంతమవుతుందని స్పష్టంచేశారు.ప్రధాని మోదీ శనివారం 18వ రోజ్‌గార్ మేళాలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన 61 వేలమందికిపైగా యువతీ యువకులకు వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేశారు. దేశ యువతకు 2026 సంవత్సరం సరికొత్త ఆశలు ఆనందాలతో మొదలైందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ నియామక పత్రం కేవలం ప్రభుత్వ ఉద్యోగంలో చేరడానికి అనుమతి మాత్రమే కాదని.. ఇది దేశ నిర్మాణానికి అందిన ఆహ్వానం అని అభివర్ణించారు. ‘అభివృద్ధి చెందిన భారత్’నిర్మాణానికి కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేయాలని కోరారు.

**నాగరిక్ దేవో భవ**

“ప్రభుత్వ కార్యాలయాల్లో గతంలో ఎదురైన అనుభవాలు గుర్తుచేసుకోవాలి. అలాంటి ఇబ్బందులు ప్రజలకు ఎదురు కాకుండా మనం వారికి సేవ చేయాలి. ఉద్యోగ జీవితంలో ప్రజాసేవే పరమార్థంగా భావించాలి. నాగరిక్ దేవో భవ అనే సూక్తిని పాటించాలి. విధి నిర్వహణలో ఉన్నప్పుడు పౌరుడిని దేవుడిగా పరిగణించాలి. యువత ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

తరువాయి 2లో

## అవసరమైతే న్యాయ పోరాటం!



ఈ-కబురు,హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ‘సిట్’ విచారణకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శనివారం పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఎర్రవల్లి నివాసంలో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ భేటీలో ‘సిట్’విచారణ తీరు తెన్నులను ఇద్దరు నేతలు పార్టీ అధినేత కేసీఆర్‌కు వివరించారు.

తరువాయి 2లో

## ‘సింగరేణి’ కాంట్రాక్టులపై విచారణకు సిద్ధం



- 2014 నుంచి ‘సింగరేణి’లో అమలైన అన్ని కాంట్రాక్టులపై విచారణకు రెడీ
- విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- టెండర్లపై విషపు రాతల రాధాకృష్ణ వండి వార్చినవన్నీ వదంతులే
- పత్రికాధిపతినని ఏది రాసినా చెల్లుతుందనుకుంటే ఊరుకోం
- నా వ్యక్తిత్వాన్ని ఒక్క కలం పోటుతో దెబ్బతీస్తానంటే సహించేది లేదు
- రాసిన కథనాలన్నీ పొరపాటని ఆయన అంగీకరించాలి
- సింగరేణిపై హరీశ్‌రావు లేఖ రాస్తే విచారణకు సీఎంను ఒప్పిస్తా
- కాంట్రాక్టు సంస్థలకు సైట్ విజిట్ నిబంధన మేం తెచ్చింది కాదు
- కోల్ ఇండియా సహా కేంద్ర సంస్థలన్నీ దాన్నే అమలు చేస్తున్నాయి

ఈకబురు, హైదరాబాద్: నైనీ కోల్‌బ్లాక్ సహా 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో అమలైన అన్ని కాంట్రాక్టులపై విచారణకు సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తమ ప్రభుత్వానికి లేఖ రాస్తే విచారణకు సీఎంను ఒప్పిస్తానని చెప్పారు. స్వార్థ ప్రయోజనాల కోసమే టెండర్లపై కట్టుకథలు అల్లుతున్నారని మండిపడ్డారు. సింగరేణి టెండర్లపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ శనివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి విలేకరుల సమావేశంలో సుదీర్ఘంగా మాట్లాడారు. నైనీ కాంట్రాక్టును ముఖ్య మంత్రి బావమరిదికి కట్టబెట్టాలని చూస్తున్నామనే ప్రచారం సత్యదూరమని.. ఇదంతా ఏబీఎన్ రాధాకృష్ణ వండి వార్చిన వదంతులేనని కొట్టిపారేశారు. ఆయా కథనాలను వేల మంది సింగరేణి కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. సింగరేణిపై గద్దలు, రాబందులు కన్నేశాయని.. వాటిని వాలనివ్వబోమని ఆయన తేల్చిచెప్పారు.

**సైట్ విజిట్ కొత్తేం కాదు**

కాంట్రాక్టు సంస్థలు సైట్ విజిట్‌కు వెళ్లాలన్న నిబంధన కొత్తదేం కాదని భట్టి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన కోల్ ఇండియా, ఎన్ఎండీసీ, ప్రభుత్వరంగ చమురు సంస్థలు, రక్షణ శాఖ సహా మరెన్నో కేంద్ర సంస్థలు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయంటూ అందుకు సంబంధించిన పత్రాలను మీడియాకు చూపారు. ఈ నిబంధనను తానే తీసుకొచ్చినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సింగరేణి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ అని, టెండర్ల వ్యవహారానికి సంబంధించిన ఫైళ్లు తన వద్దకు రావని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పాలనే ఉద్దేశంతోనే టెండర్లను రద్దు చేశామని వివరించారు. ఇంకా టెండర్ కోరిజెండం (సవరణ) రిలీజ్ చేయలేదని.. టెండర్ సమర్పించే తేదీ కూడా మొదలవలేదన్నారు. అలాంటప్పుడు సైట్ విజిట్ చేసినప్పటికీ కాంట్రాక్టు సంస్థలకు సర్టిఫికెట్లు ఇవ్వలేదనేది అవాస్తవమని భట్టి తెలిపారు.

**బీఆర్ఎస్ హయాంలోనే కొత్త డీజిల్ విధానం**

సింగరేణిలో డీజిల్ సరఫరాను కాంట్రాక్టర్లకే అప్పగించి కుంభకోణానికి పాల్పడినట్లు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన విమర్శలను భట్టి ఖండించారు. 2022లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కొత్త విధానం తెచ్చిందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు, డీజిల్ దొంగతనాలను నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. దేశవ్యాప్తంగానూ ఇదే విధానం అనుసరిస్తున్నారని చెప్పారు.

తరువాయి 2లో

## చైనాతో ఒప్పందం చేసుకుంటే...
## 100 శాతం టారిఫ్‌లు

- కెనడాకు ట్రంప్ హెచ్చరికలు
- కార్నీ తీరుపై తీవ్ర విమర్శలు



ఈకబురు,వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహాగ్ని తాజాగా కెనడా వైపు మళ్లింది. చైనాతో వాణిజ్య ఒప్పందం విషయంలో మొండిగా ముందుకెళ్తే కెనడాపై ఏకంగా 100 శాతం టారిఫ్‌లు విధిస్తామని శనివారం ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వాటి మధ్య ఒప్పందం కుదిరితే ఆ మరుక్షణమే సుంకాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్‌సోషల్‌లో ఈ మేరకు పోస్టు పెట్టారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చైనా వస్తువులు, ఉత్పత్తులను అమెరికాలో గుమ్మరించేందుకు ఆయన కెనడాను వేదికగా మార్చజూస్తున్నారని ఆరోపించారు. “కార్నీ ఉద్దేశం అదే అయితే గనక ఆయన చాలా పొరబడుతున్నారు. అలా జరిగేందుకు నేనెప్పటికీ అనుమతించబోను”అని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై కెనడా ప్రధాని కార్యాలయం అధికారికంగా స్పందించలేదు. ట్రంప్ తన పోస్టులో కార్నీని ‘గవర్నర్’గా సంబోధించడం విశేషం.

అమెరికాలో కెనడా 51వ రాష్ట్రంగా విలీనం కావాలని ఆయన పలుమార్లు సూచించడం తెలిసిందే. ఈ సంబోధన తాలూకు ఉద్దేశం కూడా అదేనంటున్నారు. ట్రంప్, కార్నీ నడుమ కొంతకాలంగా మాటల యుద్ధం సాగుతోంది. ట్రంప్‌వి ఏకపక్ష పోకడలంటూ ఇటీవల కార్నీ దుయ్యబట్టారు. దాంతో చిర్రెత్తుకొచ్చిన ట్రంప్, అసలు కెనడా బతుకుతున్నదే అమెరికా దయాదాక్షిణ్యాల మీద అంటూ దావోస్ వేదికగా ఎద్దేవా చేశారు.

తరువాయి 2లో

## గవర్నర్లను కీలుబొమ్మలుగా

కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే ఆగ్రహం




ఈ-కబురు హుబ్బళ్లి: కాంగ్రెస్ పాలిత, బీజేపీయేతర పార్టీల పాలన ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను కేంద్ర ప్రభుత్వ కీలుబొమ్మలుగా మార్చేసిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు

తరువాయి 2లో



అంజయ్య నగర్ డివిజన్ లో పోటీకి 'సై' అంటున్న ఆంజనేయులు సగర

» 3లో



## పాక్‌లో ఘోరం.. ఒకే కుటుంబంలోని 9 మంది సజీవ సమాధి

» 3లో




## నైనీ టెండర్లు రద్దు చేశారంటే కుంభకోణం జరిగినట్లే కదా..?

ఉపముఖ్యమంత్రికి హరీశ్‌రావు ప్రశ్న

ఈ-కబురు హైదరాబాద్: నైనీ టెండర్లు రద్దు చేశారంటే కుంభకోణం జరిగినట్లే కదా? అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.

తరువాయి 3లో

## తరాల వారసత్వ ప్రతీక.. గణతంత్ర కవాతు



ఈ-కబురు దిల్లీ: గణతంత్ర వేడుకల సందర్భంగా సోమవారం దిల్లీలో కర్తవ్యపథ్ వద్ద జరిగే కవాతులో ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాలవారు పాల్గొనడం ఒక ప్రత్యేకతగా నిలవనుంది. స్కౌట్స్‌లో ఒక దళానికి విశ్రాంత లెఫ్టినెంట్ అమిత్ చౌధరీ (అరుణాచల్‌ప్రదేశ్) నేతృత్వం వహించనున్నారు. “గణతంత్ర కవాతులో పాల్గొనాలనేది ఎప్పటినుంచో నా కల. చిన్నప్పుడు వీటిని టీవీలో చూసేవాడిని. ఇంట్లోనే కవాతు చేసేవాడిని. మా తండ్రి 1990లో ఇలాంటి కవాతులో గార్డుల బ్రిగేడ్ తరఫున పాల్గొన్నారు” అని ఆయన మీడియాకు తెలిపారు.

తరువాయి 3లో

# వాణిజ్య ఒప్పందాలతో యువతకు నూతన అవకాశాలు

ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు ఖర్చు చేస్తోంది. దీనివల్ల నిర్మాణ సంబంధిత రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయి. మన దేశంలో స్టార్టప్‌ల సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం 2 లక్షల రిజిస్టర్డ్ స్టార్టప్ కంపెనీలు ఉన్నాయి. 21 లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తున్నాయి. 'డిజిటల్ ఇండియాతో'నూతన ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. యానిమేషన్, డిజిటల్ మీడియాతోపాటు ఇతర రంగాల్లో ఇండియా గ్లోబల్ హబ్‌గా మారుతుండడం హర్షణీయం. యువత కృషి వల్లే ఈ ఘనత సాధ్యమవుతోంది.

సంస్కరణలతో మేలు

నేడు దేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లో పయనిస్తోంది. సంస్కరణలతో ప్రజల జీవితాలు, వ్యాపార-వాణిజ్యాలను మరింత సులభతరంగా మార్చాలని నిర్ణయించాం. వస్తు సేవల పన్ను(జీఎస్టీ)లో తదుపరి తరం సంస్కరణలతో యువ పారిశ్రామికవేత్తలకు, ఎంఎస్‌ఎంఈలకు మేలు జరుగుతోంది. చరిత్రాత్మక కార్మిక సంస్కరణల(లేబర్ కోడ్)తో కార్మికులు, ఉద్యోగుల సామాజిక భద్రత బలోపేతమైంది. వ్యాపారవేత్తలకు సైతం లబ్ధి చేకూరుతోంది.

గడిచిన పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అద్భుత ప్రగతి సాధించింది. దశాబ్ద కాలంలో దేశ జీడీపీ రెట్టింపైంది. 2014 ముందు నాటి పరిస్థితులతో పోలిస్తే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2.5 రెట్లు పెరిగాయి. పెట్టుబడులు పెరగడమంటే యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం 2014 నుంచి ఆరు రెట్లు వృద్ధి చెంది రూ.11 లక్షల కోట్లకు చేరుకుంది. ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు దాటాయి''అని ప్రధానమంత్రి వివరించారు.

మహిళా సాధికారతకు బాటలు

దేశంలో రోజ్‌గార్ మేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 11 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. శనివారం నియామక పత్రాలు అందుకున్నవారిలో 8 వేల మందికి పైగా యువతులు ఉన్నారు. గత 11 ఏళ్లలో దేశ వర్క్‌ఫోర్స్‌లో మహిళల భాగస్వామ్యం దాదాపు రెట్టింపు అయ్యిందని ప్రధాని మోదీ తెలిపారు.

ముద్ర యోజన, స్టార్టప్ ఇండియా వంటి పథకాలు మహిళా సాధికారతకు బాటలు వేశాయని, మహిళా స్వయం ఉపాధి 15 శాతం మేర పెరిగిందని గణాంకాలతో సహా వివరించారు. అంతేకాకుండా మహిళల కొనుగోలు శక్తి పెరగడంతో 2025లో ద్విచక్ర వాహనాల విక్రయాలు 2 కోట్ల మార్కును దాటాయని ప్రస్తావించారు. ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణ కోసం రూపొందించిన 'ఐగాట్'ప్లాట్‌ఫామ్‌లో ఇప్పటికే 1.5 కోట్ల మంది ఉద్యోగులు చేరారని, కొత్త ఉద్యోగులు కూడా దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# గవర్నర్లను కీలుబొమ్మలుగా మార్చారు

ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను వేధించడానికి గవర్నర్లను ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. ప్రధాన మంత్రి కార్యాలయం, కేంద్ర హోంశాఖ కార్యాలయాల ద్వారా కేంద్ర ప్రభుత్వం గవర్నర్లకు ఆదేశాలు ఇస్తోందని చెప్పారు.

ముఖ్యమంత్రులు సిద్ధంచేసిన ప్రసంగాన్ని అసెంబ్లీలో చదవొద్దని చెబుతోందని పేర్కొన్నారు. కర్ణాటక, కేరళ, తమిళనాడులో ఇలాంటి ఉదంతాలు చోటు చేసుకున్నాయని వెల్లడించారు. బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియజేయకుండా వెనక్కి పంపిస్తున్నారని చెప్పా రు. ఈ విషయంలో పై స్థాయి నుంచి ఆదేశాలు అందుతున్నాయంటూ గవర్నర్లు కూడా ప్రైవేట్ సంభాషణల్లో చెబుతున్నారని తెలిపారు. రాబోయే అన్ని ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లేకపోతే దేశంలో నిరంకుశ పాలన వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు.



## చైనాతో ఒప్పందం చేసుకుంటే... 100 శాతం టారిఫ్‌లు



దీనిపై కార్నీ స్పందిస్తూ, నియంతృత్వ పోకడలకు తల వంచకుండా ప్రపంచానికి కెనడా ఒక ఉదాహరణగా నిలుస్తుందంటూ బదులిచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో గాజా పునర్నిర్మాణానికి తలపెట్టిన శాంతిమండలిలో చేరేందుకు కెనడాకు పంపిన ఆహ్వానాన్ని వెనక్కు తీసుకుంటున్నట్టు ట్రంప్ ప్రకటించారు. చైనా తన విద్యుత్ వాహనాలపై టారిఫ్‌లను తగ్గించేలా కెనడాతో కొంతకాలంగా బేరసారాలాడుతోంది.

ప్రతిగా కెనడా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపుకు సంసిద్ధత వెలిబుచ్చింది. ఈ మేరకు ఒప్పందం దిశగా వాటి మధ్య ముమ్మరంగా చర్చలు జరుగుతున్నాయి. దీన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఈ ఒప్పందం కుదుర్చుకుంటే కెనడాను ఆర్థికంగా, సామాజికంగా చైనా పూర్తిగా కబళించేస్తుందని ఇటీవలే ఆయన హెచ్చరించారు. అమెరికా ప్రతిపాదిత గోల్డెన్‌డోమ్ రక్షణ ఛత్రంలోకి వచ్చేందుకు కెనడా నిరాకరించడంపై కూడా ట్రంప్ తీవ్ర అసహనం వెలిబుచ్చారు.

# అగ్నికీలల్లో ఐదుగురు



తమ భవనంలో మంటలు, దట్టమైన పొగలు వస్తున్నాయని పోలీసులకు తెలపడంతో అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ కొద్ది నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని ముందుగా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. నాంపల్లి స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అన్ని రహదారులను మూసివేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 20 ఫైరింజన్లను రప్పించి మంటలను ఆర్పించారు. అగ్నికీలలు, దట్టమైన పొగ క్షణ క్షణానికి పెరుగుతుండడంతో రాత్రి వరకు అందులో ఉన్న వారిని బయటకు తీసుకురాలేక పోయారు. కాగా, ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ప్రమాదంలో చిక్కుకున్న ఐదుగురు వ్యక్తులు ఫర్నిచర్ దుకాణం భవనంలో ఐదుగురు వ్యక్తులు చిక్కుకున్నారు. సెల్లార్ వాచ్‌మెన్ యాదయ్య, లక్ష్మి దంపతుల పిల్లలు ప్రణీత్, అఖిల్‌తో పాటు ఆటో డ్రైవర్ హబీబ్, ఇంతియాజ్, స్వీపర్ బీబీలు చిక్కుకున్నవారిలో ఉన్నారు. అయితే అఖిల్ (7), ప్రణీత్ (11)గన్‌ఫౌండ్రీలోని ప్రభుత్వ ఆలియా పాఠశాలలో చదువుతున్నారు. శనివారం పాఠశాలకు వెళ్లకపోవడంతో ఇద్దరు పిల్లలను సెల్లార్‌లోని ఇంట్లోనే ఉంచి తల్లిదండ్రులు ఇద్దరు బయట ఉన్నారు. అదే సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.ఆ ఇద్దరు పిల్లలను తీసుకువచ్చేందుకు ఫర్నిచర్ షాపులో పనిచేసే ఇద్దరు వ్యక్తులు సెల్లార్‌లోకి వెళ్లారు. ఈ ఇద్దరితోపాటు అందులో పని చేసే మరో ఇద్దరు సెల్లార్‌లో చిక్కుకున్నట్లు తోటి వర్కర్లు వెల్లడించారు. వీరిలో ఒకరు తప్పించుకొని బయటపడ్డాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌తో పాటు ఫైర్ పోలీసు, ఇతర శాఖల అధికారులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. సెల్లార్‌లో ఫైర్ ఇంజిన్ల ద్వారా మంటలు, దట్టమైన పొగలు ఆర్పడంతో సెల్లార్ మొత్తం నీటితో నిండిపోయింది. ఐదుగురు వ్యక్తులను బయటకు తీసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**రోబోను పంపించినా...**

అగ్నిప్రమాదాన్ని అదుపులోకి తేచ్చేందుకు పోలీసులతో పాటు హైడ్రా, డిజాస్టర్ ఫోర్స్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు పలువురు అధికారులు అర్ధరాత్రి వరకు శ్రమించారు. మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ పొగ తీవ్రత ఇంకా అదుపులోకి రాలేదు. సెల్లార్‌లో ప్లాస్టిక్ వస్తువులు, ఫర్నిచర్ ముడిపదార్థాలు ఉండడంతో ఆరు గంటలైనా భవనం నుంచి దట్టమైన పొగ తగ్గలేదు. ఫైర్ ఉన్నతాధికారులు రోబోను కూడా భవనంలోకి మంటలను, పొగలను నివారించేందుకు పంపించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అర్ధరాత్రి వరకు దట్టమైన పొగలు అదుపులోకి రాలేదు. రెస్క్యూ పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

**బ్రామ్‌టో ఫైర్ మిషన్‌తో..**

ఫైర్ అధికారులు బ్రామ్‌టో ఫైర్ మిషన్‌తో మంటలను, దట్టమైన పొగలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయతిన్చంచారు. అతి పెద్దదైన బ్రామ్‌టో మిషన్‌లో ఫైర్ సిబ్బంది ఉండి భవనం పరిసరాల 4, 5 వ అంతస్థుల అద్దాలను పగలగొట్టి మంటలను, పొగలను అదపులోకి తెచ్చేందుకు కృషి చేశారు.

**నిమిషంలో తప్పించుకొని..**

నాంపల్లి అగ్నిప్రమాదం నుంచి నిమిషం వ్యవధిలో తప్పించుకున్నాడు సంతోష్ అనే వ్యక్తి. ప్రమాదం జరిగిన సమయంలో సంతోష్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్నాడు. సెల్లార్‌లో మంటలు చెలరేగిన నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తం వ్యాపించాయి. అయితే ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమైన సంతోష్ నిమిషాలలో మెట్లపై నుంచి వేగంగా బయటికి వచ్చేశాడు. క్షణం ఆలస్యమైనా మంటల్లో చిక్కుకునేవాడనని సంతోష్ పేర్కొన్నారు.

**మంటలను అదుపులోకి తెచ్చాం : రాష్ట్ర ఫైర్ విభాగం డీజీ విక్రమ్‌సింగ్ మాన్**

ఈ ప్రమాదంలో ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురు చిక్కుకున్నారని తెలంగాణ రాష్ట్ర ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ పేర్కొన్నారు. శనివారం రాత్రి సంఘటన స్థలాన్ని ఆయన సందర్శించారు. ఫైర్, ఇతర అధికారులతో కలిసి రెస్క్యూ ఆపరేషన్ పనులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం కింద రెండు సెల్లార్‌లు ఉన్నాయన్నారు. మొదటి సెల్లార్‌లో ఫర్నిచర్‌కు సంబంధించిన మెటీరియల్స్, ఇతర ముడి పదార్థాలు ఉండడంతోనే సహాయక చర్యలకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. మంటలను అదుపులోకి తెచ్చామని, సెల్లార్లలో దట్టమైన పొగలు రెస్క్యూ ఆపరేషన్ ద్వారా అదుపులోకి తీసుకువచ్చి ఇందులో చిక్కుకున్న ఐదుగురిని బయటకు తెస్తామన్నారు. 200 మంది సిబ్బందితో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని వివరించారు.

**సజ్జనర్, కలెక్టర్ హరిచందన సందర్శన**

సంఘటన స్థలాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, సీపీ సజ్జనర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారన్నారు. అందులో చిక్కుకున్న వారిని సురక్షితంగా తెచ్చేందుకు ఫైర్‌తో పాటు ఇతర శాఖల అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

**రోబో యంత్రాన్ని తొలిసారిగా వాడిన అగ్నిమాపక శాఖ**

నాంపల్లిలో శనివారం జరిగిన భారీ అగ్ని ప్రమాద సంఘటనలో పేలుళ్లను నిరోధించేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు అగ్నిమాపక శాఖ రోబో ఫైర్ మిషన్‌ను హైదరాబాద్‌లో తొలిసారిగా ఉపయోగించింది. ఘటనా స్థలంలో జేసీబీ, భారీ క్రేన్లతో సహాయక చర్యలు చేపట్టినా అగ్నికీలలు, దట్టమైన పొగ కారణంగా సిబ్బంది లోపలికి వెళ్లేందుకు వీలు కాలేదు. దీంతో అగ్నిమాపక శాఖ రోబో శకటాన్ని రంగంలోకి దింపింది. రోబో ఫైర్ మిషన్ అనేది అగ్ని ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు, అగ్నిమాపక సిబ్బందికి సహాయం చేయడానికి తయారు చేసిన సిస్టమ్. అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని పరిస్థితుల్లో ఈ రోబో ఫైర్ మిషన్ భవనం లోపలికి వెళ్లి మంటలను ఆర్పుతుంది. అలాగే సురక్షిత మార్గాన్ని అన్వేంచి, బయట ఉన్న సిబ్బందికి మార్గాన్ని సూచిస్తుంది.

# 28 నుంచి బడ్జెట్ సెషన్ 27న అఖిలపక్ష భేటీ



మొదటి పేజి తరువాయి

ఈకబురు, న్యూఢిల్లీ: జనవరి 28వ తేదీ నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఒక రోజు ముందుగా 27వ తేదీన అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశంలో ఎజెండాతోపాటు ఇతర అంశాలు చర్చకు రానున్నాయి. పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లోని కమిటీ మెయిన్ రూంలో 27వ తేదీ ఉదయం 11 గంటలకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం జరుగనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

యూపీయే హయాంలో తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థాయిలో కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన వీబీ- గ్రామీణ్ చట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ ఒక వైపు దేశవ్యాప్త ఆందోళనలు కొనసాగిస్తుండగా, మరో వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కుదేలైన వేళ పార్లమెంట్ సెషన్ మొదలవుతుండటం గమనార్హం. ఈ నెల 28వ తేదీన ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగంతో సెషన్ ప్రారంభం కానుంది. పార్లమెంట్ చరిత్రలోనే అత్యంత అరుదుగా ఫిబ్రవరి ఒకటో తేదీ, ఆదివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటం తెల్సిందే.

# 'సింగరేణి' కాంట్రాక్టులపై విచారణకు సిద్ధం



**అయిన వాళ్లకు కట్టబెట్టిందెవరు?**

సింగరేణి కాంట్రాక్టు వ్యవహారానికి.. ముఖ్యమంత్రి, ఆయన బావమరిదికి సంబంధమే లేదని భట్టి స్పష్టం చేశారు. ఇదో కట్టుకథని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ ఆరోపిస్తున్నట్లుగా సుజన్‌రెడ్డికి చెందిన కంపెనీ శోధా కనస్ట్రక్షన్స్ అనే ప్రైవేటు కంపెనీ ఎండీ దీప్తిరెడ్డి అని, ఆమె బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కుమార్తె అని భట్టి చెప్పారు. దీన్నిబట్టి ఈ వ్యవహారంలో ఎవరెవరికి సంబంధాలున్నాయో ఆలోచించుకోవాలన్నారు. కాంట్రాక్టుల ఆశ చూపి ఉపేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి లాక్కున్నారని ఆరోపించారు. సింగరేణిలో కాంట్రాక్టు పనులు చేస్తున్న ఐదు ప్రధాన కాంట్రాక్టు సంస్థలన్నీ బీఆర్ఎస్ నేతల బంధువులవేనని తెలిపారు.

**కట్టుకథలు.. విషపు రాతల రాధాకృష్ణ**

'పెట్టుబడులు, కట్టుకథలు, విషపు రాతల రాధాకృష్ణ కొత్త పలుకు పేరుతో మొదలుపెట్టిన కథనాలన్నీ సింగరేణిపై తప్పుడు ప్రచారానికి దారి తీశాయి. పత్రికాధిపతి అని ఏది రాసినా చెల్లుతుందనుకుంటే పొరపాటు. మేం చూస్తూ ఊరుకోం'అని ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణను భట్టి విక్రమార్క హెచ్చరించారు. ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా నింద వేయడమే ఆయన కథనాల ఉద్దేశమన్నారు. ఏ గద్దలు, రాబందులు, దోపిడీదారుల ప్రయోజనాల కోసమో.. ఎవరి కళ్లలో ఆనందం కోసమో ఈ కథనాలు రాస్తున్నట్లుగా ఉందన్నారు. ఆయన కథనం రాయడం, బీఆర్ఎస్ నేత విచారణ కోరుతూ లేఖ రాయడం, కేంద్ర మంత్రి ఢిల్లీ నుంచి రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ ముగ్గురి మధ్య సంబంధం ఏమిటని ప్రశ్నించారు. తన వ్యక్తిత్వాన్ని ఒక్క కలం పోటుతో దెబ్బతీస్తానంటే సహించేది లేదని.. ఇప్పటికైనా రాసిన కథనాలన్నీ పొరపాటని ఆయన అంగీకరించాలన్నారు.

**ఫోన్ ట్యాపింగ్ దోషులకు శిక్ష పడాలి: మంత్రి జూపల్లి**

ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డ దోషులకు శిక్షలు పడాలని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకే విచారణ చేపడుతున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. సిట్ విచారణ జరుపుతుంటే బీఆర్ఎస్ నేతలు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. కేటీఆర్‌ను సిట్ సాక్షిగానే పిలిచిందని.. దోషిగా కాదన్నారు. తమ ప్రభుత్వానికి ఆయనపై కక్ష సాధించాలనే ఆలోచన ఉండి ఉంటే ఇప్పటికే అరెస్టు చేసి ఉండే వాళ్లమన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ఉండకపోతే ప్రభాకర్‌రావు ఇంతకాలం విదేశాల్లో ఎందుకు దాక్కున్నారని ప్రశ్నించారు.

# అవసరమైతే న్యాయ పోరాటం!

పార్టీ ముఖ్య నేతల పర్యటనలు, మంత్రులుగా తీసుకున్న నిర్ణయాలు, పలువురు వ్యక్తుల పేర్లను ప్రస్తావిస్తూ వారితో సంబంధాలు, పరిచయాల గురించి పోలీసులు తమను ప్రశ్నించారని వివరించారు. పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో విరాళాలు ఇచ్చిన సంస్థల వివరాలపై ఆరా తీసినట్లుగా కేసీఆర్‌కు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విచారణతో సంబంధం లేని అంశాలను సిట్ అధికారులు అడిగిన వైనాన్ని కూడా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులోనూ ఇదే తరహాలోనే సంబంధం లేని విషయాల్లో విచారణల పేరిట ప్రభుత్వం హడావుడి చేసి గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తుందనే అభిప్రాయాన్ని కేసీఆర్ వ్యక్తం చేసినట్లు తెలిసింది. సిట్ విచారణకు సహకరిస్తూనే పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే న్యాయ పోరాటం కూడా చేయాలనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైంది.


మున్సిపల్ ఎన్నికలపై కేసీఆర్ సూచనలు

మున్సిపల్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఉమ్మడి జిల్లాల వారీగా కీలక నేతలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార పర్వం, అవసరమైన చోట ఇతర పార్టీల నుంచి చేరికలు వంటి అంశాలపై ఇద్దరు నేతలు దిశానిర్దేశం చేశారు. ఇదిలా ఉంటే పార్టీ పరంగా మున్సిపల్ ఎన్నికలను పర్యవేక్షించేందుకు జిల్లాలు, మున్సిపాలిటీల వారీగా ఇన్‌చార్జిలను నియమించాలని కేసీఆర్ ఆదేశించారు.

పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలకు మున్సిపాలిటీల వారీగా పర్యవేక్షక బాధ్యతలు అప్పగించనున్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కూడా ఇన్‌చార్జిలు పర్యవేక్షించడంతో పాటు నాయకులు, కేడర్ నడుమ క్షేత్ర స్థాయిల్లో సమన్వయం కోసం పనిచేస్తారు. మున్సిపల్ ఎన్నికలపై కేసీఆర్ ఆదేశాల మేరకు ఎర్రవల్లిలో భేటీ అనంతరం శనివారం రాత్రి హైదరాబాద్‌లో కేటీఆర్, హరీశ్‌రావు కొందరు పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. మున్సిపాలిటీల వారీగా నియమించాల్సిన ఇన్‌చార్జిల జాబితాపై కసరత్తు పూర్తి చేశారు. భేటీ అనంతరం ఈ జాబితాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు.



# అంజయ్య నగర్ డివిజన్ లో పోటీకి 'సై' అంటున్న ఆంజనేయులు సగర


ఆంజనేయులు సగర

**ప్రజల ఆశీర్వాదం కోసం క్షేత్రస్థాయిలో జోరుగా పర్యటనలు**

**కష్టపడి ఎదిగిన వ్యక్తిత్వం.. దశాబ్దాల స్థానికత... సగర సంఘ పోరాటాలతో గుర్తింపు**

**ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉంది : ఆంజనేయులు సగర**

ఈకబురు, శేరిలింగంపల్లి : త్వరలో కార్పొరేషన్ ఎన్నికలను ఎదుర్కొనబోతోంది గ్రేటర్ హైదరాబాద్. ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం మరో పక్షం రోజుల్లో పూర్తి కానుండగా, గ్రేటర్ ఎన్నికల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అడుగులు వేసింది. డివిజన్ల పునర్విభజన చేపట్టడంతో పాటు జిహెచ్ఎంసి పరిధిలోని సర్కిల్, జోన్లను సైతం పునర్విభజించారు. ఇకపై ఏ క్షణమైనా జిహెచ్ఎంసి ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉండడంతో ఇప్పటి నుంచే గ్రేటర్ లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో డివిజన్ల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన అంజయ్య నగర్ డివిజన్ ప్రత్యేకతను సంతరించుకుంది. ఓవైపు మాదాపూర్ ఐటీ కారిడార్... మరోవైపు గచ్చిబౌలి ఐటీ కారిడార్..లతో మధ్యలో ఉన్న అంజయ్య నగర్ డివిజన్ ఎంతో కీలకంగా నిలుస్తుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న అంజయ్య నగర్ డివిజన్ నుంచి పోటీ చేసేందుకు స్వశక్తితో ఎదిగి, ఉద్యమాలతో వెలుగులోకి వచ్చిన మోదల ఆంజనేయులు సాగర్ సై అంటున్నారు. ప్రజల మధ్య ఉండే ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందిన ఆంజనేయులు సగర రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో అంజయ్య నగర్ డివిజన్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజల ఆశీర్వాదం కోసం ఇప్పటికే డివిజన్ వ్యాప్తంగా బస్తీవాసులు, కాలనీ సంక్షేమ సంఘాలతో జోరుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీలకు అతీతంగా ముందుకు సాగుతూ తనకు మద్దతుగా నిలిచే వారిని కూడగడుతున్నారు.

**కష్టపడి ఎదిగిన వ్యక్తిగా గుర్తింపు...**

ఆంజనేయులు సగర జీవితం గత నాలుగు దశాబ్దాలుగా అంజయ్య నగర్ డివిజన్ తో పెనవేసుకొని ఉంది. వనపర్తి జిల్లాలోని మారుమూల రేమద్దుల ప్రాంతానికి చెందిన ఆంజనేయులు సగర గత 40 ఏళ్ల క్రితం అంజయ్య నగర్ కు వచ్చి స్థిరపడ్డారు. వచ్చిన కొత్తలో నిర్మాణ రంగంలో మేస్త్రిగా తన జీవిత ప్రయాణాన్ని ప్రారంభించిన ఆంజనేయులు సగర కష్టపడి ఎదిగి భవన నిర్మాణ కాంట్రాక్టర్ గా ఎదిగాడు. తన జీవన పోరాటంలో ఆర్థికంగా ఎదగడంతో పాటు తాను ఉంటున్న ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి, పోరాటాలు సాగించాడు.

**సగర సంఘంలో క్రియాశీలక పాత్ర...**

ఆంజనేయులు సగర తన సామాజిక కులం సగర సంఘం అభివృద్ధికి కృషి చేయడం ఆయనకు రాజకీయ బలాన్ని చేకూర్చింది. ప్రస్తుతం సగర(ఉప్పర) సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆంజనేయులు గతంలో అంజయ్య నగర్ సగర సంఘం అధ్యక్షుడిగా పనిచేసి సగరుల సమస్యల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశారు. గతంలో బీజేపీలో క్రియాశీల నాయకుడిగా కొనసాగుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం గళమెత్తిన ఆంజనేయులు సగర అనంతర కాలంలో పార్టీలతో సంబంధం లేకుండా తన సేవా కార్యక్రమాలను కొనసాగించారు.

**సామాజిక సేవా కార్యక్రమాలు...**

సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం ఆంజనేయులు సగర ముందుంటారనే పేరు ఆయనకు ఉంది. పొట్ట చేత పట్టుకొని నగరానికి వచ్చి, నిర్మాణ రంగంలో కూలీలుగా పనిచేస్తున్న వారికి ఐడెంటిటీ కార్డులు అందజేయడం, ప్రమాదాల్లో మృతి చెందిన వారి పక్షాన పోరాడి వారి కుటుంబాలకు ఆసరాగా నష్టపరిహారాలు ఇప్పించిన ఉదంతాలు ఆంజనేయ సగరను రాజకీయాల వైపు ఆకర్షించింది. దీంతోపాటు పండుగల సమయంలో అంజయ్య నగర్, సిద్దిక్ నగర్, పీజేఆర్ కాలనీ, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు ఆప్తుడిగా పేరు తెచ్చుకున్నారు.

**ఐతే పార్టీ టికెట్... లేదంటే ఇండిపెండెంట్...**

రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో అంజయ్య నగర్ డివిజన్ నుంచి పోటీకి సిద్ధమవుతున్న ఆంజనేయులు సగర భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. ఏదైనా ప్రధాన పార్టీ నుంచి టికెట్ దక్కించుకొని పోటీ చేయడమా లేదా ఇండిపెండెంట్ గా రంగంలో నిలువడమా.. అనే విషయమై తన సన్నిహితులు, మద్దతుదారులతో చర్చిస్తున్నారు. ఇప్పటికే డివిజన్ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో పాటు బస్తీలు, కాలనీల అసోసియేషన్లు, యువజన విభాగాలు, మహిళా సంఘాలను కలిసి స్థానిక సమస్యలు, అభివృద్ధిపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. డివిజన్లో తనకు అనుకూలంగా ఉన్న సమీకరణాలను బేరీజు వేస్తుండడంతోపాటు పలువురు సీనియర్ నాయకులు, ప్రముఖుల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు.

**ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉంది : ఆంజనేయులు సగర**

అంజయ్య నగర్ డివిజన్ సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, ప్రజలు అవకాశం కల్పిస్తే ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటూ ప్రజా సేవ కోసం కృషి చేస్తానని ఆంజనేయులు సగర తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉండే తనకు ప్రజా సమస్యలపై, రోజువారి ప్రజల ఇబ్బందులపై పూర్తి అవగాహన ఉందన్నారు. ముఖ్యంగా అంజయ్య నగర్ డివిజన్ పరిధిలో ఉంటున్న కార్మికులకు ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలను అందించేందుకు తాను ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, త్రాగునీరు, డ్రైనేజీ కాలువల సమస్యలు, పార్కులు, స్మశాన వాటికల అభివృద్ధికి, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానని అన్నారు.


కాలనీ, బస్తీ సంఘాలతో సమావేశాలు


కాలనీ, బస్తీ సంఘాలతో సమావేశాలు


సేవా కార్యక్రమాల్లో భాగంగా స్కూల్ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం


నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

## బెంగాల్‌లో హడావుడిగా సర్ ప్రక్రియ

'ఓటు హక్కును బలోపేతం చేసే ఓటరు జాబితా ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైంది. ఓటరు జాబితా రివిజన్ ప్రక్రియ కూడా అంతే ముఖ్యమైంది. దీన్ని ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలి. అవసరమైన సమయం కేటాయించాలి. అయితే, ఇవన్నీ బెంగాల్‌లో ప్రస్తుతం లోపించాయి'అని సేన్ పేర్కొన్నారు. 'ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అత్యంత వేగంగా, హడావుడిగా జరుగుతోంది. ఓటర్లు, రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తమ ఓటు హక్కును నిరూపించుకోవడానికి అవసరమైన పత్రాలను సమర్పించేందుకు తగినంత సమయం ఇవ్వడం లేదు. ఇది ఓటర్లకు అన్యాయం, దేశ ప్రజాస్వామ్యానికి ద్రోహం'అని అమర్త్య సేన్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

అధికారులపైనా తీవ్ర ఒత్తిడి


ఓటర్లే కాదు, ఎన్నికల అధికారులు కూడా సర్ విషయంలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తనకు అర్థమైందన్నారు. తన నివాసమున్న శాంతినికేతన్ నియోజకవర్గం నుంచి ఎన్నికల అధికారులు ఫోన్ చేసి, వాకబు చేసిన అంశాలను ఆయన ఉదహరించారు. 'ఎన్నికల అధికారులు చనిపోయిన మా అమ్మ గురించి అడిగారు. నేను పుట్టినప్పుడు మా అమ్మ వయస్సెంత ఉంటుందంటూ ఆరా తీశారు. గత ఎన్నికల సమయంలో అక్కడే ఓటేశా. అప్పట్లో రికార్డులన్నీ అధికారుల వద్ద ఉన్నాయి. అందులో నా చిరునామా, మా కుటుంబ సభ్యుల పుట్టిన తేదీలు సహా అన్ని వివరాలు రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి. అయినప్పటికీ ఈ విషయాలను అడగడం బట్టి చూస్తే వారెంత ఒత్తిడికి గురవుతున్నారో అర్థమవుతుంది'అని ఆయన అన్నారు. తన మాదిరిగానే అనేక మంది గ్రామీణ భారతీయులు ఇలాంటి విచారణలను ఇప్పుడు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాంతినికేతన్ ఉన్న ఊళ్లో పుట్టిన తనకు బర్త్ సర్టిఫికెట్ లేకపోవడంతో ఓటరుగా అర్హత సాధించేందుకు స్నేహితులు తన తరఫున అవసరమైన పత్రాలను అందజేశారన్నారు. తన విషయం పరిష్కారమైనప్పటికీ, ఎటువంటి సాయం అందని సామాన్యులు పడే అవస్థలపై అమర్త్య సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. సేన్, ఆయన తల్లి వయస్సుల్లో తేడాలపై సర్ అధికారులు ఆయనకు నోటీసు పంపడం తెల్సిందే.

బీజేపీకే లాభమని అంటున్నారు

బెంగాల్‌లో చేపట్టిన సర్‌తో ఎవరికి లాభం చేకూరుతుందనే విషయంలో తనకు సొంతంగా ఎటువంటి అంచనాలు లేవని అమర్త్య సేన్ తెలిపారు. 'నేనేమీ ఎన్నికల విశ్లేషకుడిని కాను. ఈ విషయం కచ్చితంగా చెప్పలేను. నా కంటే ఎక్కువ విషయాలు తెలిసిన వ్యక్తులు చెప్పినదేమంటే.. సర్‌తో తక్కువ మంది ఓటర్లు నమోదవడం వల్ల బీజేపీకే ప్రయోజనమని. ఇది నిజమే కాదో నాకు తెలియదు'అని ఆయన అన్నారు. 'అయితే, ఈసీకి ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఎవరు లబ్ధి పొందుతారు అనే విషయంతో సంబంధం లేకుండా, ఎన్నికల సంఘం ఈ లోపభూయిష్టమైన ఏర్పాటును కొనసాగనీయరాదు. గర్వించదగ్గ మన ప్రజాస్వామ్యంలో అనవసరమైన తప్పిదాలు జరిగేలా బలవంతం చేయరాదు'అని ఆయన హితవు పలికారు.

నిరుపేదలపైనే ఎక్కువ ప్రభావం

సర్ ప్రక్రియలో ఓటరు జాబితా నుంచి నిరుపేదలే ఎక్కువగా తొలగింపునకు గురయ్యే అవకాశం ఉందని అమర్త్య సేన్ చెప్పారు. అధికారులు అడిగే ధ్రువీకరణ పత్రాలను సామాన్యులు తీసుకురావడం కష్టసాధ్యమైన విషయంగా మారడమే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. కొత్త ఓటర్ల జాబితాలో చేరడానికి అవసరమైన కొన్ని నిర్దిష్ట పత్రాలను సేకరించి, చూపించాలనే నిబంధన నిరుపేదలకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు హక్కును వినియోగించుకునే ప్రస్తుత సామాజిక వాతావరణంపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీ వర్గాలు కూడా తమ ఓటు హక్కుతో సహా ఇతర హక్కులను పరిరక్షించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బలపడిన హిందుత్వ అతివాదుల వల్ల ముస్లింలతో పాటు, కొన్ని వర్గాల హిందువులు కూడా కొన్నిసార్లు వెనుకబాటుకు గురవుతున్నారని సేన్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు అందేలా ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు.



## పాక్‌లో ఘోరం.. ఒకే కుటుంబంలోని 9 మంది సజీవ సమాధి

ఈకబురు,కిస్తాన్‌లో పలు ప్రాంతాల్లో భారీగా మంచుకురుస్తోంది. ఖైబర్ ప్రావిన్స్‌లో మంచు చరియలు విరిగి ఓ ఇంటిపై పడటంతో అందులోని ఒకే కుటుంబానికి చెందిన 9 మంది సజీవ సమాధి అయ్యారు. ఘటన నుంచి ఒక్క బాలుడు మాత్రమే గాయాలతో తప్పించుకున్నాడని అధికారులు తెలిపారు.

చిత్రాల్ జిల్లా దామిల్ ప్రాంతంలోని సెరిగాల్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుందన్నారు. ఆ ప్రాంతంలో 20 అంగుళాల మేర మంచు పేరుకుపోయిందని అధికారులు తెలిపారు. పెద్ద మంచు పలక దిగువకు జారుతూ వచ్చి పర్వతప్రాంతంలోని వీరున్న నివాసంపై పడిందని చెప్పారు.

మృతదేహాలను వెలికి తీశామని, ప్రాణాలతో ఉన్న 9 ఏళ్ల బాలుడిని వెంటనే ఆస్పత్రిలో చేర్చామన్నారు. ఖైబర్‌తోపాటు బలూచిస్తాన్, బల్టిస్తాన్ పీవోకేల్లో దట్టమైన మంచు కారణంగా జనజీవనం స్తంభించింది. ఉష్ణోగ్రతలు కొన్ని చోట్ల మైనస్ 20 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. మంచు కారణంగా రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

## తరాల వారసత్వ ప్రతీక.. గణతంత్ర కవాతు

కెప్టెన్ సమీరా జడ్ బుట్టర్ 'సమీకృత కార్యకలాపాల కేంద్రం' ప్రతినిధిగా ఒక దళానికి నాయకత్వం వహించనున్నారు. సైన్యంతో అనుబంధం పరంగా ఆమెది నాలుగో తరం. తన తండ్రి, తాత, ముత్తాత కూడా సైన్యంలో పనిచేశారని, తాను పరేడ్‌లో భాగం పంచుకోనుండటం ఎంతో గర్వంగా అనిపిస్తోందని ఆమె తెలిపారు. తన తాత బ్రిగేడియర్ సంపూరణ్ సింగ్‌కు మహా వీర్‌చక్ర, వీర్‌చక్ర శౌర్య పతాకాలు లభించాయని చెప్పారు. తమ శకటం ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తూ వీక్షకుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతుందన్నారు.

గుర్రాలు.. ఒంటెలు.. డేగలు.. జాగిలాలు

కెప్టెన్ అహాన్‌కుమార్ (26) ఈసారి కవాతులో అశ్విక దళానికి నేతృత్వం వహించనున్నారు. ఆయన దిల్లీ ప్రాంత 'జనరల్ ఆఫీసర్ కమాండింగ్'గా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ భవ్‌నీశ్ కుమార్ మనవడు. రణ్‌వీర్ అనే గుర్రంతో గత ఏడాది కవాతులోనూ అహాన్ పాల్గొన్నారు.

గుర్రాలు, రెండు మూపురాల ఒంటెలు, డేగలు, జాగిలాలు కూడా ఈసారి వీక్షకులకు కనిపించనున్నాయి. సైన్యంలో భాగంగా ఇవి గొప్ప సేవలు అందిస్తుంటాయని ఈ దళానికి నేతృత్వం వహించనున్న కెప్టెన్ హర్షితా రాఘవ్ చెప్పారు. తన తండ్రి కూడా వాయుసేనలో పనిచేశారని తెలిపారు.

సైన్యంతో అనుబంధం ఉన్న కుటుంబంలో మూడో తరానికి చెందిన కెప్టెన్ వికాస్ యాదవ్ ఈసారి గూర్ఖారైఫిల్స్‌లో నాలుగో పటాలానికి నేతృత్వం వహిస్తారు. మానవరహిత వాహనాల దళమిది. సైన్యంలోని సైనికులకు, జంతువులకు ప్రాణహాని ఉందనుకున్నప్పుడు వీటిని వాడతారని యాదవ్ తెలిపారు.

ఈసారి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం రాత్రి 7 గంటలకు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

తొలి వేడుకల ఖర్చు రూ.11,250

1950లో తొలిసారి గణతంత్ర వేడుకల్ని జరిపినప్పుడు దిల్లీ పరిపాలన యంత్రాంగం చేసిన ఖర్చు రూ.11,250. పునరావాస శిబిరాలు, గ్రామీణ పాఠశాలల్లో పిల్లలకు బొమ్మలు, మహిళలకు మిఠాయిలు పంచి ఆ వేడుకను ముగించారు. జెండాలు, స్తంభాలు, కొవ్వొత్తుల్ని వివిధ సంస్థలకు పంచారు. ఆ ఏడాది ఎక్కడా పెద్దగా హంగామా లేకుండా, ఖర్చుల భారం పడకుండా వేడుకలు పూర్తిచేశారని పురాతన పత్రాలు చెబుతున్నాయి.



## నైనీ టెండర్లు రద్దు చేశారంటే కుంభకోణం జరిగినట్లే కదా..?

సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తులపై విచారణను సిటింగ్ జడ్జి లేదా సీబీఐతో చేపట్టాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపిస్తామంటే లేఖ రాయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. సింగరేణి బొగ్గు, సోలార్ టెండర్ల వ్యవహారంపై భట్టి విక్రమార్క నిర్వహించిన ప్రెస్‌మీట్‌పై శనివారం 'ఎక్స్'లో హరీశ్‌రావు స్పందించారు. 'బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని భట్టి సూటిగా చెప్పలేక విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మీ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగిందనేది నిజం. అందులో రేవంత్‌రెడ్డి బావమరిది ఉన్నదీ నిజం. ఏ కుంభకోణం జరగకపోతే నైనీ టెండర్లను ఎందుకు రద్దు చేశారో చెప్పాలి. శుక్రవారం మరో కుంభకోణం బయటపెట్టాం. సోలార్ పవర్ స్కాంపై ఒక్కమాట కూడా ప్రెస్‌మీట్‌లో మాట్లాడలేదు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను భారాసపైకి నెట్టే ప్రయత్నం చేస్తే నిజాలు అబద్ధాలు అయిపోయి.. జరిగిన కుంభకోణాలు.. స్కీంలుగా మారిపోవు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని భట్టి చెప్పారు. దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు. ఇదే సైట్ విజిట్ విధానాన్ని సింగరేణిలోనూ అమలు చేశామని ఒప్పుకొన్నందుకు ధన్యవాదాలు' అని హరీశ్ అన్నారు.

# విఝింజం పోర్ట్ అభివృద్ధికి రూ.30,000 కోట్ల పెట్టుబడి

### అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ



విఝింజం ఓడరేవు అభివృద్ధికి అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీఎస్ఈజెడ్) మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడిని పెట్టనున్నట్లు ఆ సంస్థ ఎండీ కరణ్ అదానీ తెలిపారు. రెండో విడత కింద అదనంగా రూ.16,000 కోట్లనూ వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మొత్తం పెట్టుబడులతో 2029 కల్లా పోర్టు సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 1 మిలియన్ టీఈయూ (20 ఫీట్ ఈక్వివలెంట్ యూనిట్స్) నుంచి 5.7 మిలియన్ టీఈయూలకు పెంచుతామని వెల్లడించారు. విఝింజం పోర్టును ఏపీఎస్ఈజెడ్ నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. 'కేరళ రాష్ట్రంలో ఒక సంస్థ పెట్టబోతున్న అత్యధిక పెట్టుబడి ఇదే. భారత ఉపఖండం నుంచి అతి పెద్ద రవాణా ఓడరేవుగా విఝింజం అవతరించనుంది. అంతేకాకుండా దేశంలో అత్యంత అధునాతన సాంకేతికతతో కూడిన ఓడరేవుగాను ఇది నిలవనుంద'ని పోర్టు రెండో విడత విస్తరణను ప్రారంభించిన సందర్భంగా కరణ్ తెలిపారు.

# గృహ రుణ వడ్డీ మినహాయింపు రూ.5 లక్షలకు పెంచాలి

### అద్దె ఇళ్ల కొరతకు పరిష్కారం చూపాలి...ప్రభుత్వానికి క్రెడాయ్ వినతి



దేశంలో వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, పెరుగుతున్న వలసల నేపథ్యంలో రానున్న కేంద్ర బడ్జెట్‌లో జాతీయ అద్దె గృహాల మిషన్ (నేషనల్ రెంటల్ హౌసింగ్ మిషన్)ను ప్రారంభించాలని నిర్మాణ రంగ సంస్థల సమాఖ్య క్రెడాయ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మిషన్ కింద కేవలం డెవలపర్లకే కాకుండా, అద్దెదారులకూ పన్ను ప్రోత్సాహకాలు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా, గృహరుణాలపై ప్రస్తుతం ఉన్న వడ్డీ మినహాయింపు పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని సూచించింది.

**ఉద్యోగులకు ఉపయుక్తం..** పట్టణీకరణ కారణంగా నగరాలకు వలసలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, దేశంలో వ్యవస్థీకృత అద్దె గృహాల విభాగం ఇంకా అభివృద్ధి చెందలేదని క్రెడాయ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో మొదటి, రెండో శ్రేణి నగరాల్లో భారీ ఎత్తున అందుబాటు ధరల్లో అద్దె ఇళ్లను నిర్మించేందుకు నేషనల్ రెంటల్ హౌసింగ్ మిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపింది. డెవలపర్లకు ఆర్థిక ప్రోత్సాహకాలు, అద్దెదారులకు పన్ను వెసులుబాట్లు కల్పించడం ద్వారా అద్దె మార్కెట్‌ను క్రమబద్ధీకరించేందుకు వీలవుతుందని పేర్కొంది. దీనిద్వారా అసంఘటిత నివాసాలను అరికట్టేందుకు వీలవుతుందని, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి ఇది ఎంతో మేలు చేస్తుందని వివరించింది. ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు గృహ నిర్మాణ రంగం చోదక శక్తిగా ఉందని క్రెడాయ్ అధ్యక్షుడు శేఖర్ పటేల్ తెలిపారు.

**నిర్వచనం మారాలి..** ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా 'అందుబాటు ధరల గృహాల' అర్హత ప్రమాణాలను సవరించాలని క్రెడాయ్ తన బడ్జెట్ విజ్ఞప్తులలో పేర్కొంది. 2017 నుంచి ఈ నిర్వచనంలో ఎలాంటి మార్పులు లేవని, ప్రస్తుతం మెట్రో నగరాల్లో 60 చదరపు మీటర్లు, ఇతర నగరాల్లో 90 చ.మీటర్ల విస్తీర్ణం, రూ.45 లక్షల ధర పరిమితి ఉందని గుర్తు చేసింది. పెరిగిన భూమి, నిర్మాణ వ్యయాల దృష్ట్యా ఈ రూ.45 లక్షల పరిమితి ప్రస్తుత వాస్తవ ధరలకు సరిపోవడం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో మెట్రో నగరాల్లో కార్పెట్ ఏరియా పరిమితిని 90 చదరపు మీటర్లు, ఇతర నగరాల్లో 120 చ.మీటర్లకు పెంచాలని క్రెడాయ్ తన ప్రతిపాదనల్లో కోరింది. రూ.45 లక్షల ధరల పరిమితిని పూర్తిగా తొలగించాలని తెలిపింది. ప్రస్తుతం అందుబాటు ధరల ఇళ్లపై ఒక శాతం జీఎస్టీ అమలవుతోంది.

# 6 ఐటీ కంపెనీలపై రూ.5,400 కోట్ల భారం

### కొత్త లేబర్ కోడ్ అమలు నేపథ్యం

దిల్లీ: కొత్త కార్మిక చట్టాల అమలు కారణంగా దేశంలోని 6 ఐటీ కంపెనీలపై సుమారు రూ.5,400 కోట్ల మేర అదనపు భారం పడింది. ఈ కంపెనీలు అక్టోబరుడిసెంబరు త్రైమాసికానికి ప్రకటించిన లాభాల్లోనూ ఈ మేరకు ప్రభావం కనిపించింది. కొత్త కార్మిక చట్టాల అమలు కోసం అత్యధికంగా టీసీఎస్ రూ.2,128 కోట్ల కేటాయింపులు చేసింది. ఇన్ఫోసిస్ రూ.1,289 కోట్లు, హెచ్‌సీఎల్ టెక్ రూ.956 కోట్లు, టెక్ మహీంద్రా రూ.272 కోట్లు, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ రూ.590 కోట్లు చొప్పున కేటాయించాయి. కొత్త కార్మిక చట్టాల అమలుకు, రీకన్‌స్ట్రక్షన్ ఛార్జీలతో కలిసి రూ.302.80 కోట్లను కేటాయించినట్లు విప్రో తెలిపింది. పై కేటాయింపుల ప్రభావంతో అక్టోబరుడిసెంబరులో టీసీఎస్ 13.9%, ఇన్ఫోసిస్ 2.2%, హెచ్‌సీఎల్ టెక్ 11.2%, విప్రో 7%, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 11% చొప్పున లాభంలో తగ్గుదలను నమోదుచేశాయి. టెక్ మహీంద్రా మాత్రమే లాభంలో 14 శాతం వృద్ధిని ప్రకటించింది.

# 14.94 కోట్ల ఖాతాల లాగిన్ వివరాలు లీక్

జీమెయిల్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, నెట్‌ఫ్లిక్స్.. ఇలా వివిధ సంస్థల వద్ద నమోదైన 14.94 కోట్ల ఖాతాల లాగిన్‌కు సంబంధించిన యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ల వివరాలు బయటకు వచ్చాయని ఎక్స్‌ప్రెస్‌వీపీఎన్ నివేదిక తెలిపింది. లాగిన్ వివరాలు లీక్ అయిన వాటిల్లో జీమెయిల్ ఖాతాలు 4.8 కోట్లు, ఫేస్‌బుక్ 1.7 కోట్లు, ఇన్‌స్టా 65 లక్షలు, యాహూ 40 లక్షలు, నెట్‌ఫ్లిక్స్ 34 లక్షలు ఉన్నాయి. '96 జీబీ వరకు ఉన్న ఈ బహిర్గతమైన డేటాబేస్‌లో 14,94,04,754 ఖాతాల యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ వివరాలు ఉన్నాయి. ఇమెయిల్స్, యూజర్‌నేమ్స్, పాస్‌వర్డ్‌లు, ఖాతాకు లాగిన్ అయ్యేందుకు యూఆర్ఎల్ లింక్‌లు సహా వేల సంఖ్యలో ఫైల్స్ ఇందులో ఉన్నట్లు నేను గమనించాన'ని సైబర్‌భద్రతా పరిశోధకులు జెరామియా ఫౌలర్ తెలిపారు. వివిధ దేశాలకు సంబంధించిన '.గవ్' డొమైన్‌ల క్రెడెన్షియల్స్ (గోప్యతా వివరాలు) భద్రత పైనా జెరామియా తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ఈ కబురు, నెట్‌వర్క్ ; కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం తప్పింది. సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్తున్న ఫ్లిక్స్ ట్రావెల్స్ బస్సు శనివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తుని మండలం వి.కొత్తూరు జాతీయ రహదారి పరిధిలో ఇనుపరాడ్ల లోడుతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయవాడకు చెందిన బస్సు సహ డ్రైవర్ సుంగ రమేష్(45) అక్కడికక్కడే మృతి చెందారు. విజయవాడ గన్నవరానికి చెందిన బస్సు ప్రధాన డ్రైవర్ వెంకటసాయిగణేష్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. హైవే అథారిటీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తుని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. చలిలో రోడ్డుపై తీవ్ర అవస్థలు పడుతున్న మిగిలిన ప్రయాణికులను వివిధ ట్రావెల్స్ బస్సుల్లో ఎక్కించి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు.

# అన్ని అవసరాలకూ ఒకటే కార్డ్..

## డెబిట్ కమ్ క్రెడిట్ కార్డు తేనున్న వీసా


రవి ఏటీఎంకి వెళ్లి తన డెబిట్ కార్డుతో కొంత నగదు విత్‌డ్రా చేశాడు. ఆపై షాపింగ్‌కు వెళ్లాడు. అక్కడ రూ.10వేలు విలువైన వస్తువులను కొనుగోలు చేశాడు. పెద్ద మొత్తం కావడంతో తన పర్సులో ఉన్న క్రెడిట్ కార్డును వినియోగించాడు. అలా తనకు నాలుగైదు బ్యాంకులకు సంబంధించి క్రెడిట్, డెబిట్ కార్డులున్నాయి. దీంతో పర్సు మొత్తం వాటితోనే నిండిపోయింది. ఇలాంటి సందర్భంలో రెండింటికీ ఒకటే కార్డు ఉంటే ఎంత బాగుణ్ణో అనుకున్నాడు. ఒక్క రవికే కాదు.. మనలో చాలామందిదీ ఇదే పరిస్థితి. అలాంటి వారి కోసమే ప్రముఖ కార్డు నెట్‌వర్క్ సంస్థ వీసా.. క్రెడిట్ అండ్ డెబిట్ కార్డును తీసుకురాబోతోంది. ఈ తరహా కార్డు జపాన్‌లో విజయవంతం కావడంతో భారత్‌కూ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. వీసా ఫ్లెక్సిబుల్ క్రెడిన్షియల్ (వీసా ఫ్లెక్స్) పేరుతో వీసా తీసుకురాబోయే ఈ కార్డును క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డులా వినియోగించుకోవచ్చు. లావాదేవీ విలువను బట్టి, మర్చంట్ టైప్‌ను బట్టి, వ్యక్తుల అవసరాలను బట్టి మీకు నచ్చిన విధంగా మార్చుకోవచ్చు. కార్డుపై ఉండే 16 నంబర్ల సంఖ్యలో మాత్రం ఎలాంటి మార్పూ ఉండదు. చిన్న చిన్న లావాదేవీలకు డెబిట్ కార్డు.. పెద్ద లావాదేవీలకు క్రెడిట్ కార్డు అని సంబంధిత మొబైల్ బ్యాంక్ యాప్‌లో సెట్ చేసుకోవచ్చు. అవసరమైతే దీన్నో ప్రీపెయిడ్, ఫారెక్స్ కార్డు గానూ వినియోగించుకోవచ్చు. దీనివల్ల వేర్వేరు అవసరాల కోసం వేర్వేరు కార్డులు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదని ఉండబోదని వీసా ఇండియా అండ్ సౌత్ ఏషియా కంట్రీ మేనేజర్ సందీప్ ఘోష్ 'బిజినెస్ స్టాండర్డ్'తో పేర్కొన్నారు.

**టెకీలూ..భారత్‌కొచ్చేయండి....** జపాన్‌లో సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్, సుమిటోమో మిత్సుయి కార్డ్ కంపెనీతో కలిసి వీసా సంస్థ ఆలివ్ పేరిట ఈ తరహా కార్డును లాంచ్ చేసింది. దీనిద్వారా డెబిట్, క్రెడిట్, రివార్డు పాయింట్స్‌ను యాక్సెస్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తోంది. సుమారు 50 లక్షల మంది కస్టమర్లు దీన్ని వినియోగిస్తున్నారు. వియత్నాంలోనూ ఇలాంటి సేవలనే వీసా నెట్‌వర్క్ ప్రారంభించింది. భారత్‌లోనూ ఈ కార్డును తీసుకొచ్చేందుకు నియంత్రణ సంస్థల ఆమోదం కోసం వేచి చూస్తోంది. వివిధ బ్యాంకులతో కలిసి ఈ కార్డును తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. గతంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ డెబిట్ కమ్ క్రెడిట్ కార్డును లాంచ్ చేసింది. ఇందులో రెండు చిప్‌లు, రెండు వేర్వేరు నంబర్లు ఉంటాయి. ఒకవైపు డెబిట్ కార్డులా, ఇంకోవైపు క్రెడిట్‌కార్డులా ఉపయోగించుకోవచ్చు.



# వెండి కొండ.. కరుగుతుందా?

**–పారిశ్రామిక గిరాకీ తగ్గే ప్రసక్తే లేదు**
**–ఈ లోహానికి ప్రత్యామ్నాయం కష్టమే**
**–ధర హెచ్చుతగ్గులు తప్పవు**
**–కొనుగోళ్లకు 'ట్రైపాడ్' విధానం మంచిది**
**–విశ్లేషకుల అభిప్రాయాలు**




ఏ రోజుకారోజు పెరుగుతున్న వెండి ధరలను చూసి మదుపర్లకు పాలుపోవడం లేదు. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాములు) వెండి ధర తొలిసారిగా 100 డాలర్లను అధిగమించింది. దేశీయంగానూ కిలో రూ.3,33,000కు పైగా చేరింది. ఈ సమయంలో మరింతగా ధర పెరుగుతుందా, లేదంటే వెనక్కి వస్తుందా అని మదనపడుతున్నారు. ఇప్పటికే కొనుగోళ్లు చేసినవారు ఏం చేయాలి. అమ్మాలా ఇంకా కొనుగోలు చేయాలా? కొత్తగా వెండి కొనుగోలు చేసే వారు సైతం ముందడుగు వేయాలా. కాస్త ఆగాలా అని ఆలోచిస్తున్నారు. మరి విశ్లేషకులు ఏమంటున్నారు? గత 5 దశాబ్దాలుగా వెండి ధర స్తబ్దుగానే ఉంటోంది. చాలా కాలంగా దాని వాస్తవ ధర కంటే దిగువనే చలిస్తూ వస్తోంది. ఇప్పటికి ఒక శక్తిమంత, వ్యూహాత్మక, భర్తీ చేయలేని పారిశ్రామిక లోహంగా మారింది. ఆర్థిక వ్యవస్థలో మిళితమై సరికొత్త సాధనంగా నిలిచిందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

**––కీలక లోహంగా ఇలా..... హరిత ఇంధన, సౌర పీవీ, విద్యుత్ మౌలిక వసతులు, ఎలక్ట్రానిక్స్‌సెమీకండక్టర్స్, ఈవీలు, బ్యాటరీలు....** ఇలా పలు రంగాల్లో కీలక లోహంగా ఇది మారింది. అప్పట్లో కృత్రిమంగా తక్కువ ధరల్లో కొనసాగిన వెండి ధర ఇపుడు సర్దుబాటు అవుతోంది. ఇందుకు గత అయిదు సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న కొరత కూడా కలిసివచ్చింది. సరఫరాతో పోలిస్తే గిరాకీ భారీగా ఉండడంతో ధర భగ్గుమనడానికి కారణమైంది. దీంతో అంతర్జాతీయంగా పలు దేశాలు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో వెండి నిల్వలను అట్టేపెట్టిఉంచుకుంటున్నాయి. తద్వారా సరఫరా వ్యవస్థకు భంగం కలగకుండా చూసుకుంటున్నాయి. జాతీయ భద్రత, ఇంధన స్వాతంత్ర్యం, సాంకేతిక సార్వభౌమత్వానికి ఇది ఒక కేంద్ర బిందువుగా మారడం ఇందుకు కారణం.

**––గిరాకీ తగ్గుతుందా?....** ప్రభుత్వాలతో పాటు సంస్థలు, వ్యక్తులు కూడా హెడ్జింగ్ కోసం వెండిని కొంటున్నారని 'ఈకబురు'తో కోటక్ సెక్యూరిటీస్ హెడ్ ఆఫ్ కమొడిటీ, కరెన్సీ రీసెర్చ్ అనింద్య బెనర్జీ తెలిపారు. 'పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యీకరణ నిమిత్తం వెండినీ చేర్చుకుంటున్నారు. కంపెనీలైతే ధరలు మరింత పెరుగుతాయేమోనన్న భయంతో నిల్వలు పెంచుకుంటున్నాయి. ముఖ్యంగా భారీ స్థాయి ప్రైవేటు ఇన్వెస్టర్లు అధిక మొత్తంలో భౌతిక వెండిని తక్కువ ధరల్లో కొని పెట్టుకుని ఉన్నార'ని చెప్పారు. ఇక ఈ సమయంలో గిరాకీ తగ్గుతుందా అన్న అనుమానాలు రావొచ్చు. అయితే.. పరిశ్రమలు ఎన్నటికీ వినియోగాన్ని తప్పించుకోలేవు. ఆధునిక సాంకేతికతలో వెండి తప్పనిసరిగా మారింది. అంతర్జాతీయ మందగమనం వంటిదేదో ఎదురైతే తప్ప గిరాకీ తగ్గే ప్రసక్తే లేదని విశ్లేషకులు అంటున్నారు. ఇపుడు కొనాలా.. వద్దా? 'వెండి ధరపై దీర్ఘకాలంలో బులిష్‌గానే ఉన్నాం. అయితే ఊగిసలాటలు మాత్రం తప్పవ'ని బెనర్జీ తెలిపారు. 'దిద్దుబాటు 1015% వరకు కనిపించడం సాధారణమే. ఒక వేళ అనిశ్చితులు పెరిగితే 2025% వరకూ పతనం కొనసాగొచ్చు. మదుపర్లు సరైన సమయం కోసం ఎదురు చూడడం కంటే 'ట్రైపాడ్' వ్యూహం అవలంబించడం మంచిది. అంటే ఒక భాగం ప్రస్తుతం, క్రమంగా కొద్ది కాలం పాటు ఇంకో భాగం, మూడో భాగం భారీ దిద్దుబాటు కోసం అట్టేపెట్టిఉంచుకోవడం మంచిది. ఇక పోర్ట్‌ఫోలియోలో వెండినీ జత చేసుకోవాలి. అంతే తప్ప దానిని మాత్రమే పరిగణించరాదు. మొత్తం పోర్ట్‌ఫోలియోలో వెండి, బంగారం 2530% వరకు కేటాయించుకోవచ్చు. ఇందులోనూ బంగారం, వెండిని 60:40/70:30 నిష్పత్తిలో ఉంచుకోవచ్చ'న్నారు.

**––ఏటా సమీక్ష తప్పనిసరి....** 'వెండికి ఉన్న 'హైబీటా' తత్వం వల్ల ఊగిసలాటలు అధికంగా ఉంటాయి. కాబట్టి ఆ నిష్పత్తులు సరిపోతాయ'ని వివరించారు. ప్రస్తుతం రికార్డు గరిష్ఠాలకు వెండి చేరింది కదా అని స్వల్పకాల లాభాల స్వీకరణపై దృష్టి పెట్టడం మంచిది కాదు. అసెట్ అలొకేషన్, పీరియాడిక్ రీబ్యాలెన్సింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. డీడాలరైజేషన్ వేగవంతమవుతోన్నందున అన్ని అసెట్ విభాగాల్లోనూ ఊగిసలాటలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకోవడం తప్పనిసరనీ తెలిపారు.వెండి అనేది నిర్మాణాత్మకంగా బలంగా కనిపిస్తున్నా.. ఊగిసలాటలు భారీగా ఉంటాయి. అందుకే భావోద్వేగ నిర్ణయాల కంటే, క్రమశిక్షణతో కేటాయింపులు చేసుకోవడం మంచిది.

# కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం రూ.3,446 కోట్లు

కోటక్ మహీంద్రా బ్యాంక్ 202526 అక్టోబరుడిసెంబరు త్రైమాసికంలో రూ.3,446 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.3,305 కోట్లతో పోలిస్తే ఇది 4 శాతం ఎక్కువ. ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.16,050 కోట్ల నుంచి రూ.16,741 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.13,428 కోట్ల నుంచి రూ.13,903 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.7,196 కోట్ల నుంచి రూ.7,565 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.93 శాతం నుంచి 4.54 శాతానికి తగ్గింది. ఏకీకృత ప్రాతిపదికన బ్యాంక్ లాభం రూ.4,701 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ.4,924 కోట్లకు చేరింది. ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.5 శాతం నుంచి 1.3 శాతానికి మెరుగైంది. నికర ఎన్‌పీఏ నిష్పత్తి సైతం 0.41 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గింది. కేటాయింపులు మాత్రం రూ.794 కోట్ల నుంచి రూ.810 కోట్లకు పెరిగాయి. బ్యాంక్ మూలధన కనీస నిష్పత్తి 22.79 శాతం నుంచి 22.63 శాతానికి చేరింది. 2025 డిసెంబరు 31 నాటికి మొత్తం ఖాతాదార్ల ఏయూఎం (నిర్వహణలోని ఆస్తులు) రూ.7,87,950 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇవి రూ.6,85,134 కోట్లుగా ఉన్నాయి. క్రెడిట్ కార్డు విభాగంలో వార్షిక ప్రాతిపదికన ప్రతికూల వృద్ధి నమోదైంది. మొత్తం వ్యాపారాన్ని సమీక్షిస్తున్నాం. కొత్త ఉత్పత్తులు ఆవిష్కరిస్తున్నాం. నిర్మాణ సామగ్రి పరిశ్రమ నెమ్మదించింది. పరిశ్రమ స్థాయిలోనే మా వృద్ధి కూడా నమోదైంది. స్టాండర్డ్ ఛార్టర్డ్ నుంచి కొనుగోలు చేసిన వ్యక్తిగత రుణ పోర్ట్‌ఫోలియో ఊహించిన దాని కంటే మెరుగ్గా ఉంద'ని కోటక్ మహీంద్రా ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ ఫలితాలు ప్రకటించిన అనంతరం వెల్లడించారు.




# అల్ట్రాటెక్ సిమెంట్ లాభం రూ.1,729.44 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరుడిసెంబరు త్రైమాసికానికి అల్ట్రాటెక్ సిమెంట్ ఏకీకృత ప్రాతిపదికన రూ.1,729.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 202425 ఇదే కాలంలో నికర లాభం రూ.1,363.44 కోట్లుగా నమోదైంది. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.17,778.83 కోట్ల నుంచి రూ.21,829.68 కోట్లకు చేరింది. ఇండియా సిమెంట్స్, బిర్లా వైట్ వాల్‌కేర్ (ఇంతకుముందు వండర్ వాల్‌కేర్), యూఏఈకి చెందిన ఆర్ఏకేడ బ్ల్యూసీటీలను కొనుగోలు చేయడం వల్ల 202526 అక్టోబరుడిసెంబరు త్రైమాసిక ఫలితాలను ఏడాదిక్రితం ఇదే సమయం నాటి ఆర్థిక ఫలితాలతో పోల్చిచూడలేమని కంపెనీ వెల్లడించింది. అల్ట్రాటెక్ సిమెంట్‌లో కేశోరామ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిమెంట్ వ్యాపార విలీనం 2025 మార్చి 1 నుంచి అమల్లోకి రావడం కూడా ఇందుకు మరో కారణంగా పేర్కొంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఇతర ఆదాయంతో కలిపి కంపెనీ మొత్తం ఏకీకృత ఆదాయం 15 శాతం పెరిగి రూ.21,965.26 కోట్లకు చేరింది. విక్రయాలు 15 శాతం అధికమై 33.85 మెట్రిక్ టన్నులుగా నమోదయ్యాయి. కేబుళ్లు, వైర్ల వ్యాపారంలోకి అడుగుపెట్టే ప్రణాళిక పైనా కసరత్తు చేస్తున్నామని సంస్థ పేర్కొంది.

## సమాజానికి అవసర మైన చిత్రం



'ఆత్మన్యూనత భావనని అధిగమించి జీవితంలో ఎలా ముందడుగు వేయాలో చెప్పే స్ఫూర్తిదాయకమైన కథ ఇది. నీలో ఉన్న లోపం నీకు బలం కావాలి, దాన్ని స్వీకరించి ముందుకు వెళ్లాలని చెప్పగలిగే సినిమాలు మరిన్ని రావాలి, దానికి 'శ్రీ చిదంబరం గారు' పునాది కావాలని కోరుకుంటున్నా" అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్. ఆయన ముఖ్య అతిథిగా 'శ్రీ చిదంబరం గారు' విడుదల తేదీ పోస్టర్ ఆవిష్కరణతోపాటు, చిత్రంలోని 'వెళ్లేదారిలోన...' పాట విజయోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రమిది. వినయ్‌రత్నం దర్శకుడు. చింతా వినీషారెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాతలు. ఫిబ్రవరి 6న వంశీ నందిపాటి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ "కీరవాణిని ఒప్పించి ఇందులో పాట పాడించడంతోనే ఓ పెద్ద లక్ష్యాన్ని చేరుకుంది చిత్రబృందం. సమాజానికి ఎంతో అవసరమైన, స్ఫూర్తిదాయకమైన కథ ఇద"న్నారు. మా రెండో సినిమాలోనే కీరవాణి పాట పాడటం ఎంతో ఆనందంగా ఉందన్నారు సంగీత దర్శకులు చందు- రవి.

## తమిళంలో ఇంకొకటి?

'సింగారాల సీతాకోకని.." అంటూ ఇటీవలే 'పరాశక్తి' సినిమాతో తెరపై సందడి చేసింది కథానాయిక శ్రీలీల. ఆమె నటించిన తొలి తమిళ చిత్రమిదే. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ తార.. ఇప్పుడు మరో తమిళ చిత్రానికి పచ్చజెండా ఊపిందా? అంటే అవుననే అంటున్నాయి సినీవర్గాలు. యువహీరో ప్రదీప్ రంగనాథన్ ఓ సైన్స్ ఫిక్షన్ సినిమాకి దర్శకత్వం వహించబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇందులో ఆయన సరసన అందాల తార మీనాక్షి చౌదరిని ఎంపిక చేశారు. తాజాగా ఈ చిత్రంలో మరో కథానాయికగా శ్రీలీలను తీసుకోబోతున్నట్లు సమాచారం. చర్చలు చివరి దశలో ఉన్నాయని, పూర్తి వివరాల్ని త్వరలో అధికారికంగా ప్రకటించబోతున్నట్లు సమాచారం. మరి అన్నీ సవ్యంగా జరిగితే.. ప్రదీప్ ఈ ఇద్దరు తారలతో ఎలాంటి హంగామా చేస్తాడో చూడాలి.



## మారిన స్వయం భూ.. విడుదల



ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రావాల్సిన 'స్వయం భూ' వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర బృందం శనివారం అధికారికంగా ప్రకటిస్తూ కొత్త విడుదల తేదీని పంచుకుంది. దీన్ని ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నిఖిల్ కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని భరత్ కృష్ణమాచారి తెరకెక్కించారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. దీన్ని తొలుత ఫిబ్రవరి 13న విడుదల చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ.. వీఎఫ్ఎక్స్ పనుల వల్ల వేసవికి వాయిదా వేశారు. చారిత్రక అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ డ్రామాలో వీఎఫ్ఎక్స్ అద్భుతంగా ఉండనుందని.. అందుకే కావాల్సినంత సమయం తీసుకొని దీన్నొక అద్భుత విజువల్ వండర్‌లా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకి సంగీతం: రవి బస్రూర్, కూర్పు: తమ్మిరాజు, ఛాయాగ్రహణం: కేకే సెంథిల్ కుమార్.

## నాకు భయం లేదు నేనే విధ్వంసాన్ని



'రెడీ టు రోర్.. కింగ్' అంటూ బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్ నటిస్తున్న 'కింగ్' సినిమా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. ఈ ఏడాది డిసెంబరు 24న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఎక్స్‌లో అధికారికంగా వెల్లడించింది. ఈ సందర్భంగా 'నాకు భయం లేదు నేనే విధ్వంసాన్ని' అనే షారుక్ డైలాగ్‌తో టైటిల్ ప్రకటన వీడియోను పంచుకుంది. ఈ సినిమాని సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్నారు. 'పఠాన్' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న మరో స్పై యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్, దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్ నటిస్తున్నారు.

## మాస్ కథతో... మార్చి నుంచే!

విజయవంతమైన 'వీరసింహా రెడ్డి' తర్వాత నందమూరి బాలకృష్ణ గోపీచంద్ మలినేని కలయికలో మరో చిత్రం రానున్న సంగతి తెలిసిందే. బాలకృష్ణ 111వ చిత్రంగా కొన్ని నెలల కిందటే ఆ ప్రాజెక్ట్‌ని అధికారికంగా ప్రకటించారు. ఇక సినిమా పట్టాలెక్కడమే తరువాయి అనుకున్న దశలో... బడ్జెట్ పరిమితుల దృష్ట్యా కథని మార్చాల్సి వచ్చింది. కొన్ని రోజులుగా మరో కథపై దర్శకుడు గోపీచంద్ మలినేని కసరత్తులు కొనసాగిస్తూ వచ్చారు. ఇటీవలే బాలకృష్ణకు ఆ కొత్త కథని చెప్పడం, ఆయన పచ్చజెండా ఊపడంతో సినిమా చిత్రీకరణకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాస్ యాక్షన్ కథతో, మార్చి నెల నుంచి సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించనున్నారు. మొదట ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికగా నయనతార పేరు వినిపించింది. కథ మారింది కాబట్టి, మరో కొత్త కథానాయికకు చోటు దక్కుతుందా లేక, నయనతారే నటిస్తుందా అనే విషయంలో స్పష్టత రావాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడాల్సిందే.



## నన్ను పెట్టుకుంటే నీకు డబ్బులు రావు.. ఆ నటుడి సూచనతో మనసు మార్చుకున్న దర్శకుడు

ఒక సినిమాకు కథ ఎంత ముఖ్యమో నటీనటుల ఎంపిక కూడా అంతే ముఖ్యం. అప్పుడే సాధారణ కథ కూడా అసాధారణ రీతిలో ప్రేక్షకులను అలరిస్తుంది. చాలా తక్కువ మంది దర్శకులు, నటీనటులు మాత్రమే దీన్ని పరిగణనలోకి తీసుకుని చిత్రాలను తెరకెక్కిస్తుంటారు. సరిగ్గా అలాంటి కథలు, పాత్రలతో అలరిస్తుంటారు అక్షయ్ కుమార్. ముఖ్యంగా దేశభక్తి నేపథ్యం, పీరియాడిక్ డ్రామా ఉన్న చిత్రాల్లో తనదైన నటనతో అదరగొడుతుంటారు. అలా ఆయన నటించిన చిత్రమే 'ఎయిర్‌లిఫ్ట్'. (Airlift) 2016లో విడుదలైన ఈ మూవీ తాజాగా పదేళ్లు పూర్తి చేసుకుంది. రూ.30 కోట్ల బడ్జెట్‌తో తీస్తే, రూ.220 కోట్లకు పైగా వసూలు చేసింది. తాజాగా ఈ మూవీ గురించి దర్శకుడు రాధాకృష్ణ మేనన్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో కథానాయకుడు రంజిత్ పాత్రలో అక్షయ్ నటించిన సంగతి తెలిసిందే. అయితే, తొలుత ఆ పాత్ర కోసం ఇర్ఫాన్‌ఖాన్‌ను అనుకున్నారట. కానీ, ఆయన సూచన మేరకే అక్షయ్‌ను ఫైనల్ చేశారట.

"ఈ కథ అనుకోగానే నా మనసులో మెదిలిన నటుడు ఇర్ఫాన్ ఖాన్. సరికొత్త ఆలోచనలను ప్రోత్సహించే నటుల్లో ఇర్ఫాన్ ఉంటారంటూ నిర్మాత నిఖిల్ అడ్వాణీ చెప్పడంతో ఇద్దరం వెళ్లి ఆయనను కలిసి కథ చెప్పాం. ఇది విన్న ఇర్ఫాన్ ఏమన్నారో తెలుసా? 'రాజా.. ఇది అద్భుతమైన స్క్రిప్ట్. హాలీవుడ్ స్థాయిలో నీ విజన్‌ఉంది. కానీ, నాతో ఈ సినిమా చేస్తే, నీ విజన్‌కు తగిన స్థాయిలో డబ్బులు రావు. కుదిరితే అక్షయ్‌తో చేయండి. ఆయన గురించి మీకు తెలుసు కదా! అని సున్నితంగా తిరస్కరించారు' అంటూ దర్శకుడు వివరించారు. ఇర్ఫాన్ కాదనే సరికి నిర్మాత నిఖిల్ అడ్వాణీ, సహ నిర్మాత విక్రమ్ మల్హోత్రలు బాలీవుడ్‌లో ఉన్న ఏ-లిస్ట్ హీరోల్లో ఒకరితో చేద్దామని అనుకున్నారట.

"వేరే సినిమా విషయమై అక్షయ్‌ను కలిసి కథ చెబితే ఆయనకు నచ్చలేదు. 'ఇది అంతగా బాగోలేదు. మీ దగ్గర వైవిధ్యమైన కథ ఉంటే చెప్పండి' అని అక్షయ్ అడగడంతో రాజా మేనన్ 'ఎయిర్‌లిఫ్ట్' కథ ఆయనకు చెప్పారు. అంతేకాదు, ఇర్ఫాన్‌ఖాన్ మూవీని తిరస్కరించిన విషయమూ వివరించారు. 'మరి నా దగ్గరకు ఎందుకు వచ్చారు' అని అడగ్గా, 'మీరు సీరియస్ కథలు చేయరు కదా. పైగా రాజా మేనన్ ఈ మూవీకి వర్క్‌షాప్స్ నిర్వహించాలనుకుంటున్నారు. మీరు రారేమోనని అనుకుంటున్నాం. అందుకే ముందుగా మీకు చెప్పలేదు" అని అన్నారట. అది విని నవ్వేసిన అక్షయ్.. ఈ సినిమా చేస్తానని, వర్క్‌షాప్స్‌కు కూడా హాజరవుతానని చెప్పడంతో 'ఎయిర్‌లిఫ్ట్' పట్టాలెక్కడమే కాదు, విడుదలై బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు సాధించింది.



# జకోవిచ్ @400

**ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశం**
**సినర్, స్వైటెక్, పెగులా కూడా**





గ్రాండ్‌స్లామ్ చరిత్రలోనే ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా 400 మ్యాచ్‌లు నెగ్గాడు సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్. ఆస్ట్రేలియన్ ఓపెన్లో ప్రిక్వార్టర్స్ చేరే క్రమంలో మూడో రౌండ్లో 63, 64, 76 (74)తో బొటిక్ వాండి (నెదర్లాండ్స్)పై గెలిచాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 400 విజయాలు సాధించిన తొలి ప్లేయర్‌గా జకోవిచ్ ఘనత సాధించాడు. రోజర్ ఫెదరర్ (369), రఫెల్ నాదల్ (314) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు. ఆస్ట్రేలియన్ ఓపెన్లో 102 మ్యాచ్‌లు నెగ్గిన జకోవిచ్.. ఫెదరర్‌ను సమం చేశాడు. రాడ్‌లేవర్ ఎరీనాలో ఇప్పటికే 10సార్లు ఛాంపియన్‌గా నిలిచిన నొవాక్.. 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ సాధించి చరిత్ర సృష్టించాలనే సంకల్పంతో కదులుతున్నాడు.

**సినర్ కష్టంగా..:** రెండో సీడ్ యానిక్ సినర్ కాస్త కష్టంగా ప్రిక్వార్టర్స్ చేరాడు. అతడు 46, 63, 64, 64తో స్పిజిరి (అమెరికా)ను ఓడించాడు. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు కాళ్లు పట్టేయడంతో చాలా ఇబ్బందిపడిన సినర్.. తొలి సెట్లో 42తో ఆధిక్యంలో ఉన్నస్థితి నుంచి వెనుకబడ్డాడు. బలమైన సర్వీసులతో విజృంభించిన స్పిజిరి.. ఈ సెట్ గెలిచి ఆధిక్యంలో నిలిచాడు. కానీ సినర్ బలంగా పుంజుకున్నాడు. తర్వాతి మూడు సెట్లలో ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి విజయాన్ని అందుకున్నాడు. మ్యాచ్‌లో ఈ ఇటలీ స్టార్.. 17 ఏస్‌లు, 56 విన్నర్లు కొట్టాడు. అయిదో సీడ్ ముసెటి (ఇటలీ), ఎనిమిదో సీడ్ షెల్టన్ (అమెరికా), తొమ్మిదో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా), పన్నెండో సీడ్ రూడ్ (నార్వే) ప్రిక్వార్టర్స్ చేరారు. ముసెటి 57, 64, 62, 57, 62తో మచాక్ (చెక్)ను ఓడించగా.. ఫ్రిట్జ్ 76 (75), 26, 64, 64తో మాజీ ఛాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) పోరాటానికి తెరదించాడు. 40 ఏళ్ల వావ్రింకా ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఆడడం ఇదే చివరిసారి. రూడ్ 64, 64, 36, 75తో సిలిచ్ (క్రొయేషియా)ను ఓడించాడు. పదిహేనో సీడ్ కచనోవ్ (రష్యా) 67 (57), 63, 36, 46తో డార్డెరి (ఇటలీ) చేతిలో.. మెన్సిక్ (చెక్) 62, 76 (75), 76 (75)తో క్విన్ (అమెరికా)ను ఓడించాడు.

**స్వైటెక్ తడబడినా..:** టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ ప్రిక్వార్టర్స్ చేరింది. కలిన్‌స్కయా (రష్యా)తో మ్యాచ్‌లో ఆమె తడబడినా.. పుంజుకుని విజయాన్ని అందుకుంది. రెండో సీడ్ స్వైటెక్ 61, 16, 61తో కలిన్‌స్కయాను ఓడించింది. తొలి సెట్‌ను చాలా తేలిగ్గా గెలుచుకున్న స్వైటెక్‌కు.. రెండో సెట్లో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురైంది. రెండో గేమ్‌లో సర్వీస్ కోల్పోయిన స్వైటెక్.. 14తో వెనుకబడి సెట్‌ను చేజార్చుకుంది. మూడో సెట్లో స్వైటెక్ విజృంభించింది. 50తో ఆధిక్యంలోకి వెళ్లిన ఈ పోలెండ్ తార.. తేలిగ్గా సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో స్వైటెక్ 2 ఏస్‌లు, 24 విన్నర్లు కొట్టింది. నాలుగో సీడ్ అనిసిమోవా (అమెరికా) 61, 64తో స్టెర్న్స్ (అమెరికా)ను ఓడించగా.. ఆరో సీడ్ పెగులా (అమెరికా) 63, 62తో సెలెక్‌మెటెవా (రష్యా)పై నెగ్గింది. మెర్టెన్స్ (బెల్జియం) 60, 64తో బర్టూన్‌కోవా (చెక్)పై, రిబకినా (కజకిస్థాన్) 62, 63తో వాలెంటోవా (చెక్)పై, వాంగ్ (చైనా) 75, 64తో నోస్కోవా (చెక్)పై గెలిచారు. మాజీ ఛాంపియన్ నౌమీ ఒసాకా (జపాన్) టోర్నీ నుంచి వైదొలిగింది. గాయం కారణంగా మాడిసన్ ఇంగ్లిస్ (ఆస్ట్రేలియా) తో మూడో రౌండ్ మ్యాచ్‌లో ఆమె ఆడలేదు. యుకి జంట ముందంజ: పురుషుల డబుల్స్‌లో యుకి బాంబ్రి (భారత్)గొరాన్‌సన్ (స్వీడన్) జంట మూడో రౌండ్లో ప్రవేశించింది. రెండో రౌండ్లో యుకి ద్వయం 46, 76 (75), 63తో గొంజాలెజ్ (మెక్సికో)డేవిడ్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. శ్రీరామ్ బాలాజీ (భారత్)నీల్ (ఆస్ట్రియా) జోడీ 57, 16తో మార్సెలో (ఎల్ సాల్వడార్)పవిచ్ (క్రొయేషియా) జంట చేతిలో ఓడింది.

# ఎదురులేని యువ భారత్

**–కివీస్‌పై ఘనవిజయం**
**–మెరిసిన ఆయుష్, అంబ్రిష్, హెనిల్**



అండర్19 ప్రపంచకప్‌లో భారత్‌కు ఎదురేలేదు. హ్యాట్రిక్ విజయంతో ఆయుష్ మాత్రే బృందం సూపర్ సిక్స్‌కు దూసుకెళ్లింది. శనివారం గ్రూప్‌బి ఆఖరి మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. వర్షం కారణంగా 37 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అంబ్రిష్ (4/29), హెనిల్ పటేల్ (3/23) ధాటికి న్యూజిలాండ్ 36.2 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌటైంది. కాలమ్ (37), సెల్విన్ సంజయ్ (28), కాటర్ (23) మాత్రమే రాణించారు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53; 27 బంతుల్లో 2×4, 6×6), వైభవ్ సూర్యవంశీ (40; 23 బంతుల్లో 2×4, 3×6) మెరుపులతో భారత్ 13.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో గ్రూప్‌బిలో ఆడిన మూడు మ్యాచ్‌లూ గెలిచిన యువ భారత్.. 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ గ్రూప్ నుంచి బంగ్లాదేశ్ (3), న్యూజిలాండ్ (2) కూడా సూపర్ సిక్స్ చేరాయి. అమెరికా టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆదివారం ఆరంభమయ్యే సూపర్ సిక్స్‌లో మొత్తం 12 జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి తలపడతాయి. గ్రూప్2లో ఉన్న భారత్.. 27న జింబాబ్వే, ఫిబ్రవరి 1న పాకిస్థాన్‌తో తలపడనుంది. ఆయుష్, వైభవ్ దూకుడు: ఛేదనలో ఆరంభంలోనే భారత్.. ఆరోన్ జార్జ్ (7) వికెట్ కోల్పోయింది. 4 ఓవర్లకు స్కోరు 27/1. అక్కడ నుంచి వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రే సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డారు. 8 ఓవర్లకు 87/1తో భారత్ విజయం దిశగా దూసుకెళ్లింది. వైభవ్ ఔటైనా.. ఆయుష్ దూకుడు కొనసాగించాడు. ఈ క్రమంలో 24 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. అర్ధసెంచరీ చేశాక ఆయుష్ వెనుదిరిగినా.. వేదాంత్ (12 నాటౌట్), విహాన్ (16 నాటౌట్) పని పూర్తి చేశారు. భారత్ మరో 141 బంతులు ఉండగానే విజయాన్ని అందుకుంది. అంతకుముందు అంబ్రిష్, హెనిల్ పటేల్ విజృంభించడంతో న్యూజిలాండ్ నిలవలేకపోయింది. 22 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. ఆ తర్వాత కోలుకోలేకపోయింది.

**––సంక్షిప్త స్కోర్లు..** న్యూజిలాండ్: 36.2 ఓవర్లలో 135 ఆలౌట్ (కాలమ్ 37 నాటౌట్, సెల్విన్ సంజయ్ 28, జాకబ్ కాటర్ 23; అంబ్రిష్ 4/29, హెనిల్ పటేల్ 3/23, ఖిలాన్ పటేల్ 1/26, మహ్మద్ ఇనాన్ 1/26, కనిష్క్ చౌహాన్ 1/30) భారత్: 13.3 ఓవర్లలో 130/3 (ఆయుష్ మాత్రే 53, వైభవ్ సూర్యవంశీ 40, విహాన్ 17 నాటౌట్, వేదాంత్ 13 నాటౌట్; మాసన్ క్లార్క్ 1/29, జస్కరణ్ సంధు 1/34, సంజయ్ 1/22).

## బంగ్లా ఔట్.. పాక్ బోర్డు ఛైర్మన్ మొసలికన్నీరు

టీ20 ప్రపంచకప్ (T20 World Cup 2026) నుంచి బంగ్లాదేశ్‌ను తప్పించి స్కాట్లాండ్‌కు అవకాశం ఇస్తున్నట్లు ఐసీసీ వర్గాలు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పొట్టికప్‌లో పాక్ ఆడుతుందో లేదో అనేది తమ ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకుంటుందని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నక్వీ (Mohsin Naqvi) వ్యాఖ్యానించారు. ''బంగ్లాదేశ్‌కు అన్యాయం జరిగింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బోర్డు సమావేశంలో నేను అదే చెప్పాను. ఐసీసీ ద్వంద్వ ప్రమాణాలు కలిగి ఉండకూడదు. బంగ్లాదేశ్ ప్రధాన వాటాదారు. వారికి అన్యాయం చేయకూడదు'' అంటూ మొసలికన్నీరు కార్చారు. బంగ్లాదేశ్‌ను టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనడానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. పాక్ ఆడే మ్యాచులన్నింటినీ శ్రీలంకలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. భద్రత కారణాల దృష్ట్యా భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. తమ మ్యాచ్‌ల్ని శ్రీలంకకు మార్చాలని బంగ్లా ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. ఆ అభ్యర్థనను తిరస్కరించిన ఐసీసీ భారత్‌లోనే ఆడాలని తేల్చిచెప్పింది. అయినా, బంగ్లా తీరు మార్చుకోకపోవడంతో ప్రస్తుత ర్యాంకింగ్స్ ఆధారంగా ఆ స్థానాన్ని స్కాట్లాండ్‌తో భర్తీ చేస్తున్నట్లు ఐసీసీ ప్రకటించింది.

# సాధిస్తారా సిరీస్..

**–కివీస్‌తో భారత్ మూడో టీ20 నేడు**



న్యూజిలాండ్‌కు వన్డే సిరీస్ కోల్పోయినప్పటికీ, ఆ ప్రభావం ఏమాత్రం కనిపించనివ్వకుండా టీ20ల్లో చెలరేగిపోతున్న టీమ్‌ఇండియా.. సిరీస్ మీద గురి పెట్టింది. వరుసగా మూడో విజయంతో సిరీస్ చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో ఆదివారం మూడో టీ20లో బరిలోకి దిగుతోంది. గువాహటి: బౌలర్లు విఫలమవుతున్నప్పటికీ, బ్యాటర్ల జోరుతో కివీస్‌తో టీ20 సిరీస్‌లో దూసుకెళ్తున్న భారత జట్టు.. హ్యాట్రిక్, సిరీస్ విజయం మీద కన్నేసింది. గువాహటిలోని బర్సపరా స్టేడియంలో ఆదివారం జరిగే మూడో టీ20లో ఈ రెండు జట్లు తలపడనున్నాయి. సూపర్ ఫామ్‌లో ఉన్న బ్యాటింగ్ లైనప్.. భారత్‌కు మరో విజయం సాధించి పెడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక సంజు వంతు: కివీస్‌తో టీ20 సిరీస్ సాగే కొద్దీ బ్యాటింగ్‌లో భారత్‌కు బాగా కలిసొస్తోంది. సుదీర్ఘ కాలంగా ఫామ్‌తో తంటాలు పడుతున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రెండో టీ20లో ఫామ్ అందుకుని 82 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. రెండేళ్లకు పైగా విరామం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ సైతం ఈ మ్యాచ్‌లో చెలరేగాడు. తొలి టీ20లో అభిషేక్ శర్మ అదరగొట్టాడు. హార్దిక్ పాండ్య, రింకు సింగ్, శివమ్ దూబె కూడా తమ బ్యాట్ వాడి చూపించారు. ఇక బ్యాటింగ్ ఆర్డర్లో కొంత ఆందోళన రేకెత్తిస్తున్నది సంజు శాంసన్ ఒక్కడే. శుభ్‌మన్ గిల్‌పై వేటు పడడంతో అభిషేక్‌కు ఓపెనింగ్ భాగస్వామిగా అతనే ఖరారయ్యాడు. కానీ తొలి రెండు టీ20ల్లో అతను 10, 6 పరుగులతో నిరాశపరిచాడు. మూడో టీ20లో అయినా సంజు తనదైన శైలిలో చెలరేగుతాడేమో చూడాలి. కివీస్‌కు కూడా బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న నేపథ్యంలో మొదట బ్యాటింగ్ చేస్తే వీలైనంత ఎక్కువ స్కోరు చేయాలి. మొదట బౌలింగ్ చేస్తే.. భారీ లక్ష్య ఛేదనకు సిద్ధంగా ఉండాలి. భారత బౌలింగ్ అయితే అంత గొప్పగా సాగట్లేదు. పేసర్లు, స్పిన్నర్లు ధారాళంగా పరుగులిచ్చేస్తున్నారు. రెండో టీ20లో వికెట్ తీయకుండా 53 పరుగులిచ్చిన అర్ష్‌దీప్‌పై ఆదివారం వేటు పడొచ్చు. గత మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్న బుమ్రా అతడి స్థానంలో ఆడతాడు. హర్షిత్ రాణా తుది జట్టులో కొనసాగే అవకాశముంది. వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు. హార్దిక్ పాండ్య, శివమ్ దూబె కూడా పేస్ బౌలింగ్‌లో సహాయ పాత్ర పోషిస్తారు. తొలి రెండు టీ20ల్లో కివీస్ ఓడినప్పటికీ.. ఆ జట్టు బ్యాటింగ్ బాగానే సాగింది. డెవాన్ కాన్వే, టిమ్ సీఫర్ట్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, డరిల్ మిచెల్, చాప్‌మన్, శాంట్నర్‌లతో ఆ జట్టుకు లోతైన బ్యాటింగ్ లైనప్ ఉంది. బౌలింగ్‌లో మాత్రం ఆ జట్టు భారత్ కన్నా ఎక్కువ ఇబ్బంది పడుతోంది. పేసర్లు హెన్రీ, డఫీ.. స్పిన్నర్లు శాంట్నర్, ఇష్ సోధిలపై ఆ జట్టు ఎక్కువ ఆశలతో ఉంది. గువాహటి పిచ్ బ్యాటింగ్‌కు బాగానే అనుకూలిస్తుంది. వికెట్ నుంచి పేసర్లకు కొంత సహకారం ఉంటుంది.

# బెంగళూరుకు బ్రేక్



**–డబ్ల్యూపీఎల్-4లో తొలి ఓటమి**
**–దిల్లీ క్యాపిటల్స్ ఘనవిజయం**

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్లో అప్రతిహతంగా సాగిపోతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బ్రేక్ పడింది. అయిదు వరుస విజయాలతో ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన ఆ జట్టు.. ఆరో మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓటమి పాలైంది. శనివారం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటిన డీసీ.. 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్లో తొలిసారిగా బెంగళూరు బ్యాటింగ్ తేలిపోవడంతో మొదట ఆ జట్టు 20 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. నందని శర్మ (3/26), మరిజేన్ కాప్ (2/17), మిన్ను మణి (2/18), షినెలీ హెన్రీ (2/22) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. బెంగళూరు జట్టులో కెప్టెన్ స్మృతి మంధాన (38; 34 బంతుల్లో 6×4, 1×6) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడింది. ఆమె కాకుండా రాధ యాదవ్ (18), జార్జియా వోల్ (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. పదో ఓవర్లో స్మృతి ఔటయ్యేసరికి ఆర్సీబీ స్కోరు 62/2. ఆ తర్వాత దిల్లీ బౌలర్లు పోటీ పడి వికెట్లు తీయడం, భాగస్వామ్యాలు నమోదు కాకపోవడంతో ఆర్సీబీ స్వల్ప స్కోరుకు పరిమితమైంది. అనంతరం లారా వోల్వార్ట్ (42 నాటౌట్; 38 బంతుల్లో 4×4, 1×6) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో లక్ష్యాన్ని డీసీ.. 15.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు లిజెలీ లీ (6), షెఫాలి వర్మ (16) త్వరగా వెనుదిరిగినప్పటికీ.. కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (24), మరిజేన్ కాప్ (19 నాటౌట్)లతో కలిసి భాగస్వామ్యాలు నెలకొల్పిన లారా జట్టును గెలిపించింది. బెంగళూరు బౌలర్లలో సయాలీ సత్ఘారే (2/18), రాధ యాదవ్ (1/10) రాణించారు. 6 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో ఇప్పటికీ బెంగళూరే అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. 4 మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉన్న డీసీ.. ఆ తర్వాత వరుసగా రెండో విజయంతో రెండో స్థానానికి ఎగబాకడం విశేషం. బెంగళూరు: 20 ఓవర్లలో 109 ఆలౌట్ (స్మృతి మంధాన 38, రాధ యాదవ్ 18; నందని శర్మ 3/26, మరిజేన్ కాప్ 2/17, మిన్ను మణి 2/18, షినెలీ హెన్రీ 2/22) దిల్లీ: 15.4 ఓవర్లలో 111/3 (లారా వోల్వార్ట్ 42 నాటౌట్, జెమీమా 24, మరిజేన్ కాప్ 19 నాటౌట్; సయాలి సత్ఘారే 2/18, రాధ 1/10)

# అవును.. బంగ్లా ఆడదు

**టీ20 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్**
**బీసీబీకి ఐసీసీ ఈ-మెయిల్**



భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు ఆడుతుందా లేదా అనే ఉత్కంఠకు తెరపడింది. ఆ జట్టును టోర్నీ నుంచి ఐసీసీ తప్పించింది. దాని స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రపంచకప్ కోసం ఎంపిక చేసింది. ఈ మేరకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఐసీసీ ఈమెయిల్ పంపడమే కాక.. అధికారిక ప్రకటన కూడా చేసింది. ఐసీసీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని బీసీబీ పేర్కొంది. ''టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఇక భాగం కాదు. షెడ్యూల్ ప్రకారం టోర్నీలో పాల్గొనడానికి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) నిరాకరించింది. భారత్‌లో మ్యాచ్‌లు ఆడే విషయమై బీసీబీ ఆందోళనను తీర్చడానికి సుదీర్ఘంగా చర్చలు జరిపిన అనంతరం ఈమేరకు నిర్ణయం తీసుకున్నాం'' అని ఐసీసీ పేర్కొంది. ఐపీఎల్ నుంచి తమ ఫాస్ట్ బౌలర్ ముస్తాఫిజుర్‌ను తప్పించినందుకు నిరసనగా.. టీ20 ప్రపంచకప్‌నకు తమ జట్టును పంపడానికి బీసీబీ నిరాకరించిన సంగతి తెలిసిందే. భారత్‌లో తమ ఆటగాళ్లు, సిబ్బంది భద్రతకు ముప్పు ఉందని పేర్కొంటూ తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీని కోరింది. అయితే బంగ్లా ఆటగాళ్లకు భారత్‌లో ముప్పు ఉన్నట్లు ఎలాంటి సంకేతాలు లేవని తమ నివేదిక ద్వారా తేల్చిన ఐసీసీ.. బీసీబీ విజ్ఞప్తికి అంగీకరించలేదు. భారత్‌కు రావాలా వద్దా అన్నది తేల్చుకోవడానికి బుధవారం వరకు గడువు విధించగా.. బీసీబీ మాత్రం తమ జట్టును ఇక్కడికి పంపడానికి తమ ప్రభుత్వం నుంచి అనుమతి లేదని తేల్చేసింది. మరోవైపు ఐసీసీ బోర్డు సమావేశంలో బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించడాన్ని మెజారిటీ దేశాలు వ్యతిరేకించాయి. కేవలం బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాత్రమే ఇందుకు అనుకూలంగా ఓట్లు వేశాయి. అయినా బీసీబీ తీరు మారకపోవడంతో ఐసీసీ.. ర్యాంకింగ్స్ ఆధారంగా బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రపంచకప్ కోసం ఎంపిక చేసింది. ఈ మెగా టోర్నీ కోసం సిద్ధంగా ఉండాలని స్కాట్లాండ్ జట్టుకు ఇప్పటికే ఐసీసీ నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది. బంగ్లా స్థానంలో ఆ జట్టు ఫిబ్రవరి 7న టోర్నీ తొలి రోజే వెస్టిండీస్‌తో మ్యాచ్ ఆడుతుంది. ఆ తర్వాత 9న ఇటలీతో, 14న ఇంగ్లాండ్‌తో, 17న నేపాల్‌తో గ్రూప్ మ్యాచ్‌ల్లో తలపడుతుంది.

**పాక్ ఏం చేయబోతోంది?:** తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ డిమాండుకు మద్దతుగా నిలుస్తూ వచ్చిన పాకిస్థాన్.. ఇప్పుడా దేశాన్ని టోర్నీ నుంచి తప్పించిన నేపథ్యంలో ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరం. బంగ్లాకు బాసటగా పాక్ కూడా టోర్నీ నుంచి తప్పుకొంటుందా అన్న చర్చ మొదలైంది. దీనిపై పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ స్పందించాడు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయమే తమకు శిరోధార్యమన్నాడు. ''మా ప్రధాని విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన రాగానే సలహా కోరతాం. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నడుచుకుంటాం. మా ప్రభుత్వం వద్దంటే వాళ్లు ఇంకో జట్టును ఆహ్వానించవచ్చు'' నఖ్వీ అన్నాడు. బంగ్లాదేశ్‌కు ఐసీసీ అన్యాయం చేసిందని నఖ్వీ అభిప్రాయపడ్డాడు. ''బంగ్లాదేశ్ ఐసీసీలో కీలక పాత్రధారి. వారితో అన్యాయంగా వ్యవహరించారు. బుధవారం ఐసీసీ సమావేశంలో కూడా నేను ఇదే చెప్పా. భారత్‌కు బంగ్లా జట్టును పంపకూడదన్న నిర్ణయం వెనుక చాలా కారణాలున్నాయి. ఇక్కడ ఒక దేశం (భారత్‌ను ఉద్దేశించి) అన్నింటినీ నిర్దేశిస్తోంది. ఇంతకుముందు భారత్, పాకిస్థాన్‌ల కోసం ఐసీసీ వేదికలను మార్చినపుడు.. బంగ్లాదేశ్ కోసం అలా ఎందుకు చేయరు'' అని నఖ్వీ ప్రశ్నించాడు.

**నష్టం భారీగానే..** బీసీసీఐ, ఐసీసీ నుంచి జట్టు భద్రతకు పూర్తి హామీ లభించినప్పటికీ సహేతుకమైన కారణం లేకుండా టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలిగినందుకు బంగ్లాదేశ్ భారీ మూల్యమే చెల్లించుకోబోతోంది. ముందుగా టోర్నీలో పాల్గొన్నందుకు లభించే 5 లక్షల డాలర్లను (రూ.4.5 కోట్లు) ఆ జట్టు కోల్పోతుంది. దీంతో పాటు టోర్నీ స్పాన్సర్ల నుంచి వచ్చే ఆదాయమూ దక్కదు. మరోవైపు ఐసీసీ నుంచి బీసీబీకి వచ్చే వార్షిక ఆదాయంలోనూ కోత పడుతుంది. ఏటా ఆ దేశానికి ఐసీసీ నుంచి రూ.247 కోట్ల ఆదాయం వస్తుంది. ఇది బీసీబీ వార్షిక బడ్జెట్లో 60 శాతం. వీటన్నింటికీ మించి బీసీబీకి జరిగే పెద్ద నష్టం.. భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆగిపోవడం. సమీప భవిష్యత్తులో బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటించే అవకాశం లేదు. ఆ జట్టునూ తమ దేశానికి రానివ్వదు. మరో దేశంతో ద్వైపాక్షిక సిరీస్‌తో వచ్చే ఆదాయంతో పోలిస్తే భారత్‌తో సిరీస్ ద్వారా పది రెట్లు ఎక్కువ ఆర్జిస్తుంది బంగ్లాదేశ్. దీన్ని బట్టి భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆగిపోవడం వల్ల ఆ దేశం ఏ స్థాయిలో నష్టపోతుందో అంచనా వేయొచ్చు.